నవతెలంగాణ
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
మంగళవారం 30 మే 2023

మగ్దుమ్‌నగర్ కాలనీవాసులకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి





నవతెలంగాణ-సదాశివపేట

మగ్దుమ్ నగర్ కాలనీ వాసులకు విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ధర్నా అనంతరం టౌన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తాజుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి పి. వినోదలు సంయుక్తంగా మాట్లాడుతూ.. గత ఆరేండ్ల నుండి సిద్ధాపూర్ కాలనీలోని మగ్దుమ్ నగర్ కాలనీలో దాదాపు 100కు పైగా మంది పూరిగుడిసెలు వేసుకుని నివసిస్తున్నారన్నారు. అక్కడి ప్రజలకు ఎలాంటి మౌలిక సదుపాయాలు లేవని.. విద్యుత్ కనెక్షన్ కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే విద్యుత్ అధికారుల స్పందించి అక్కడ కాలనీలో నివసించే ప్రజలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎంఎ. రెహమాన్ మాట్లాడుతూ.. మానవతా దక్పథంతో విద్యుత్ అధికారులు ఆ కాలనీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. పార్టీ నాయకులు ఏ ముస్తఫా సాధిక్ అలీ, యాకూబ్ అలీ, వీరయ్య, పాండు, దత్త స్వామి, పూలమ్మ లక్ష్మి, శంకరమ్మ, రహిమ బేగం, తస్లీమ్, రాజమణి, నాగలక్ష్మి, సుప్రియ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి @ రూ.6,500

- సిండికేట్‌గా మారిన పత్తి వ్యాపారం
- 40 శాతం పత్తి ఇప్పటికీ ఇళ్లలోనే నిల్వ
- ఒకేసారి పత్తి ధర తగ్గడంతో అన్నదాతల ఆందోళన
- అగమ్యగోచరంగా పత్తి రైతుల పరిస్థితి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు
- లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతుల ఆవేదన





నవతెలంగాణ - ఝరాసంగం

నెల రోజులు ఆగితే పత్తి ధర పెరగకపోతుందా.. ఇన్ని నెలలు ఆగాం ఇంకో నెల రోజులు ఆగితే ధరలు పెరుగుతాయని రైతులు ఎదురుచూస్తున్న క్రమంలో ఒక్కసారిగా క్వింటాలకు రూ.వెయ్యి తగ్గడంతో అన్నదాతలల్లో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఎక్కువ ధర పలికిన పత్తి ఈ సంవత్సరం తగ్గడంతో అయోమయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ప్రైవేటులో స్వల్పంగా ఎక్కువ లభిస్తుండడంతో సంవత్సరం పొడవునా శ్రమించి సాగు చేసిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. గత సంవత్సరం సీజన్ ముగిసే సమయానికి క్వింటాల్ పత్తి ధర రూ.10 వేలు పలికింది. ఈ ఏడాది ప్రారంభంలో అమాంతంగా పెరిగిన ధర ఒక్కసారిగా పడిపోయింది. గత రెండు నెలలుగా క్వింటా ల్ రూ.7500 పలకగా, రెండు రోజుల క్రితం అమాంతంగా రూ.6500లకు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిండికేట్‌గా మారిన వ్యాపారులు వీలైనంత తక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సీజన్ ఆరంభంలో క్వింటాల్‌కు రూ.9 వేల వరకు పలికింది. పత్తి సేకరించే సమయంలో పెరుగుతుందనుకున్న ధరలు అమాంతం తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. మరో పక్క ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో ఉన్నారు.

సీసీఐ కొనుగోలు లేక..

రైతులు పత్తి పండించడం ఒక ఎత్తయితే, దాన్ని కనీస మద్దతు ధరకు అమ్ముకోవడం వారికి సవాల్‌గా మారింది. ప్రభుత్వపరంగా పత్తికి మద్దతు ధర తక్కువగా ఉండటం, ప్రైవేటు మార్కెట్లో కొంతమేర అధికంగా లభిస్తుండటంతో రైతన్నలు ప్రైవేటు వైపే మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వం నియోజక వర్గానికి ఒకటి చొప్పున సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ఈ సంవత్సరం పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు జోలికే వెళ్లలేదు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటును ఆశ్రయించాల్సి వస్తోంది. దీన్ని అవకాశంగా మలుచుకున్న దళారులు అమాంతం ధర తగ్గించారు. ధర లభించిన చోటుకు వెళ్దామంటే రవాణా భారం అధికం కావడంతో రైతన్నల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. మండలంలో ఈ ఏడాది 30 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు అయింది. ఎకరాకు 10 నుంచి 12 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశారు. అయితే ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా నీట మునగడంతో పంట దిగుబడి తగ్గిపోయింది. పంట దిగుబడి తగ్గడంతో ఈ ఏడాది అధికంగా రేటు లభిస్తుందనుకున్న రైతులకు ఆశనిపాతమే ఎదురైంది. గత సంవత్సరం ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలకు రూ.6700 వరకు ప్రకటించింది. ప్రైవేటు మార్కెట్లో సైతం క్వింటాల్‌పై రూ.6 వేల నుంచి రూ.6,200 వరకు మాత్రమే ధర పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు వరకు 60 శాతం మాత్రమే మార్కెట్‌కు వచ్చినట్లు సమాచారం. ఇంకా దాదాపు 40 శాతం పత్తి పంట ఇంకా రైతుల ఇండ్లలో నిల్వ ఉంది. కొల్లూర్ గ్రామంలోనే 600 క్వింటాళ్ల పత్తి నిల్వ ఉంది. దీన్నే ఆసరాగా తీసుకున్న ప్రైవేట్ వ్యాపారులు పత్తి తేమ శాతం అధికంగా ఉందని, నల్ల బారిన పత్తి ఉందని కోతలు విధిస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

ధరలు తగ్గుముఖం

పత్తి సేకరించే సమయం వరకు బాగానే ధర పలికిన పత్తి ఒక్కసారిగా పడిపోవడంతో అమ్ముకోవాలో.. వద్దో అనే మీమాంసలో రైతులు ఉండిపోయారు. దీంతో సేకరించిన పత్తిని ఇళ్ల వద్దే నిల్వ చేసుకున్నారు. ఆశించిన ధర ఎప్పుడు వస్తుందో అప్పటి వరకు విక్రయించకుండా నిల్వ ఉంచుకోవాలని రైతులు భావిస్తున్నారు. మరోవైపు పెరుగుతాయనుకున్న ధరలు రోజురోజుకు తగ్గుతుండడంతో నిరాశకు లోనవుతున్నారు. గత ఏడాది పత్తిని అమ్మిన తర్వాత ఒక్కసారిగా ధర పెరిగింది. ఈ సంవత్సరం కూడా కలిసి వస్తుందేమోనన్న ఆశతో ఉన్నారు. ఈ కారణంగా మార్కెట్‌కు తరలించకుండా ఇంటి వద్ద నిల్వ చేస్తున్నారు. ఈ ఏడాది కూడా సీజన్ ముగిసే నాటికి ధర పెరుగుతుందని రైతులు భావిస్తుండగా, వ్యాపారులు కావాలనే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వపరంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో ఎలాగైనా తమ వద్దకే వస్తారన్న ధీమాతో వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల నడ్డి విరుస్తున్నారు.

ఏం చేయాలో తోచని పరిస్థితి

అష్టకష్టాలు పడి 10 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ఫిబ్రవరి నాటికి దాదాపు పంట తీయడం పూర్తయింది. జనవరిలో ఉన్న ధర ఫిబ్రవరిలో తగ్గడంతో మార్కెట్‌కు వేయలేదు. ఇంకొన్ని రోజులు ఆగితే ధర పెరగకుండా పోతుందా? అని ఇప్పటి వరకు వేచి చూశాను. ప్రస్తుతం ధరలు ఇంత పెద్ద మొత్తంలో తగ్గుతాయని అనుకోలేదు. రూ.6500 వరకు క్వింటాల్‌కు వ్యాపారులు అడుగుతున్నారు. ఈ ధరకైతే గిట్టుబాటు కావడం లేదు. పెట్టిన పెట్టుబడి ఖర్చులు సైతం రావడం కష్టంగా మారుతుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి పత్తి రైతులను ఆదుకోవాలి.

- నర్సింహారెడ్డి, కొల్లూర్ గ్రామం

కేంద్రం గిట్టుబాటు ధర కల్పించాలి

మండలంలో పత్తి పంట అధికంగా సాగు చేస్తున్న విషయం వాస్తవమే. సీసీఐ కొనుగోలు కేంద్రాల కంటే ప్రైవేట్ మార్కెట్లో ధర ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఇప్పటి వరకు సిసిఐ కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేదు. కేంద్ర ప్రభుత్వం పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. ప్రతిసారి గుజరాత్ వ్యాపారులు వచ్చి పత్తి కొనుగోలు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో టెక్స్టైల్ పరిశ్రమలు ఎక్కువగా ఉండటం వల్ల మన దేశం పత్తి కాకుండా ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవడం వల్లనే దేశీయ పత్తికి డిమాండ్ తగ్గిపోతుంది. ధరల తగ్గుదల విషయాన్ని రైతులు నష్టపోకుండా మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తాం.

- సుభాష్ రావు,
మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు





రాష్ట్ర ప్రగతిని చాటి చెప్పాలి







- దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

నవ తెలంగాణ కొండపాక, మెదక్‌టౌన్, సంగారెడ్డి

రాష్ట్ర ప్రగతిని చాటే విధంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అదనపు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్వేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ జూన్ 2 నుంచి జూన్ 21 వరకు రాష్ట్ర దశాబ్ది వేడుకలలో మన ప్రగతి చాటేలా విధంగా ఘనంగా నిర్వహించాలని అన్నారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణ పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. రైతు దినోత్సవం నాడు జిల్లాలో ఉన్న రైతు వేదికలలో వేడుకలు జరగాలన్నారు. ప్రతి గ్రామం నుంచి రైతులను డప్పు చప్పుళ్లతో రైతు వేదికలకు తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వం ప్రతి రైతుకు కల్పించిన సౌకర్యాలు, అందించిన సహాయంపై తెలియజేయాలన్నారు. భోజనం ఏర్పాట్లు ఉండాలన్నారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగ సందర్భంగా గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువు వద్ద బతుకమ్మ, బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు, కట్ట మైసమ్మ పూజ, భోజనాలు పకడ్బందీగా చేయాలని తెలిపారు. రైతు దినోత్సవం, ఊరురా చెరువుల పండుగ నిర్వహణకు జిల్లాలో అధికారులతో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి అంశాన్ని పర్యవేక్షించాలన్నారు. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు కావద్దన్నారు. విద్యుత్ రంగంలో గత పరిస్థితి, నేడు సాధించిన ప్రగతి తెలియజేస్తూ నాడు- నేడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, పోలీస్ ఆధ్వర్యంలో సురక్షా దివస్, తెలంగాణ రన్ నిర్వహించాలన్నారు. పారిశ్రామిక ప్రగతి, సాగునీటి రంగంలో సాధించిన విజయాలు తెలియజేయాలని అన్నారు. జూన్ 9న సంక్షేమ సంబురాలు సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రెండవ విడత గొర్రెల పంపిణీ, అవకాశం ఉన్న చోట ఇంటి పట్టాల పంపిణీ, బీసీ కులవృత్తుల ఆర్థిక సహాయం ప్రారంభించాలని అన్నారు. బీసీ కుల వృత్తుల ఆర్థిక సహాయంపై క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక ప్రకారం మార్గదర్శకాలు అందిస్తామని, దాని ప్రకారం లబ్దిదారులను ఎంపిక చేసి జూన్ 9న ప్రారంభించాలని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన నూతన జిల్లాలు, మండలాలు, గ్రామాల వివరాలు తెలియజేయాలని, మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో సాధించిన ప్రగతి, క్రొత్త ఆసుపత్రుల ఏర్పాటు, అందిస్తున్న అదనపు సేవలను వివరించాలని, వైద్య ఆరోగ్య శాఖ దినోత్సవం నాడు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ ప్రారంభించాలని అన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి సాధించిన విజయాలు ఘనంగా చాటాలని సీఎస్ అన్నారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల సందర్భంగా పారిశుధ్య కార్మికులకు సన్మానం చేయాలని, సఫాయిన్న సలాం అన్న ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు.మిషన్ భగీరథ క్రింద ఇంటింటికి త్రాగునీటి సరఫరా, గిరిజనోత్సవం, పెరిగిన పచ్చదనం, విద్యాశాఖలో సాధించిన ప్రగతి పక్కాగా తెలియజేయాలని, ఆధ్యాత్మిక రంగంలో సాధించిన ప్రగతి, అమరుల సంస్మరణ కార్యక్రమాలు పకడ్బందీగా జరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ఆధ్వర్యంలో జూన్ 2 న ఉదయం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో అన్ని శాఖల ద్వారా సాధించిన ప్రగతి వివరించేలా పకడ్బందీగా దశాబ్ది వేడుకలను నిర్వహిస్తామని అన్నారు. సమావేశంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్, జెడ్పీ సీఈవో రమేష్, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్డిఓ చంద్రమోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి, బిసి సంక్షేమ అధికారి మురళి, జిల్లా వైద్య%డ%ఆరోగ్య శాఖ అధికారి డా.. కాశీనాథ్, జిల్లా అటవీ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, ఉద్యానవన అధికారి సునిత, డిపిఓ దేవకిదేవి, డిపిఆర్ఓ రవికుమార్ ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి అబ్దుల్ రహమాన్ పాల్గొన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ 21 రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించుకొని అధికారులకు దిశా నిర్దేశం చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, ప్రతిమ సింగ్, రమేష్, డిఎస్పీ సైదులు, జిల్లా అధికారులు యేసయ్య, చందు నాయక్, సాయిబాబా, ఆశాకుమారి, విజయశేఖర్ రెడ్డి, జయరాజ్, బ్రహ్మాజీ, రవి ప్రసాద్, విజయలక్ష్మి, రజిని, ఖాసీం, రాధాకిషన్, రాజి రెడ్డి, జెంలా నాయక్, సత్యనారాయణ రెడ్డి, ఇందిరా,కరుణ, కమలాకర్, సాయి రామ్ పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాలకు సంబంధించి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జెడ్పి సీఈఓ ఎల్లయ్య,డి ఆర్ ఓ నగేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పార్లే ఆగ్రోలో మెరుగైన వేతన ఒప్పందం

- కార్మికులకు బస్సు సౌకర్యం
- ఐక్య పోరాటంతోనే సాధ్యం
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు, పార్లే ఆగ్రో యూనియన్ అధ్యక్షులు కే.రాజయ్య



నవతెలంగాణ-పటాన్‌చెరు

కార్మికుల ఐక్యతతోనే పార్లే ఆగ్రో పరిశ్రమలో మెరుగైన వేతనం ఒప్పందం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కార్మిక సంఘం అధ్యక్షులు కే.రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని పాశమైలారంలోని పార్లే ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో సోమవారం డీసీఎల్ రవీందర్ రెడ్డి సమక్షంలో వేతన ఒప్పందం పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కార్మికుల ఐక్యతతో మంచి వేతన ఒప్పందం సాధించామన్నారు. రాష్ట్రంలోనే బెవరేజ్ పరిశ్రమలలో మెరుగైన వేతన ఒప్పందంగా అభివర్ణించారు. పరిశ్రమలో సీఐటీయు ద్వారా రెండవ ఒప్పందం చేయడం జరిగిందన్నారు. ప్యాకేజీ 8600 రూపాయలని ఇతర అలవెన్సులు కలిపి ర 9798 రూపాయలు డైరెక్టుగా వచ్చాయని తెలిపారు. సి టి సి గా చూస్తే 13వేల రూపాయలు అని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండడం ద్వారనే ఇది సాధ్యమైందన్నారు. సీఐటీయూ రాకముందుకు ఈ పరిశ్రమలో కార్మికులకు చాలా తక్కువ వేతనాలు ఉన్నాయని.. సీఐటీయూ వచ్చిన ఈ నాలుగేళ్లలో రెండు అగ్రిమెంట్ల ద్వారా 19 వేల రూపాయలు పెరిగా యన్నారు. సీఐటీయూ అంటేనే మెరుగైన వేతన ఒప్పందాలన్నారు. ఇంకా వీడిఏ 8.80 రూపాయలని.. 1982 సిరీస్ అని చెప్పారు. మెరుగైన వీడిఏ కూడా సాధించామన్నారు. అలాగే పరిశ్రమ నుంచి సంగారెడ్డి వరకు ఈ ఒప్పందంలో బస్సు సౌకర్యాన్ని సాధించామని.. చాలా రోజుల నుంచి బస్సు సౌకర్యం లేక కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే యూనిఫామ్, బూట్లు, జరికిని, స్వీటు, అడ్వాన్సులు, రాత్రి షిఫ్ట్ వాళ్లకు స్నాక్స్, క్యాంటీన్ సబ్సిడీ, బీమా సౌకర్యం, ఫినరల్ డబ్బులు ఈ ఒప్పందంలో సాధించడం జరిగిందన్నారు. పెరిగిన వేతనాలు మే నెల నుంచి అమలు అవుతాయన్నారు. మిగతా నెలల ఏరియార్స్ యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. ఒప్పందంలో కార్మికులకు అనేక చట్టపరమైన సౌకర్యాలు సాధించడం జరిగిం దన్నారు. కార్మికుల ఐక్యత ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. అగ్రిమెంట్‌కు సహకరించిన యజమాన్యానికి, కార్మికులకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ జీఎం మల్లికార్జున్‌రెడ్డి, హెచ్‌ఆర్ కరీం, యూనియన్ ఆఫీస్ బేరర్స్ సంతోష్ కుమార్, రాజశేఖర్, జంగయ్య కిరణ్ ,సుధాకర్ , సుజిత్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి



ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి



నవతెలంగాణ నర్సాపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 21 రోజులపాటు జరిగే దశాబ్ది ఉత్సవాలను జూన్ రెండు నుంచి 22 వరకు జరిగే విజంతం చేయాలని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీరాజు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. 9 సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి పనులు ఆయా కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఈ ఉత్సవాలకు జడ్పిటిసిలు ఎంపిటిసిలు సర్పంచులు ప్రజా ప్రతినిధులు ఆయా శాఖల అధికారులు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు సూచించారు .ఈ ఉత్సవాల లో భాగంగా గ్రామ గ్రామాన జెండా ఆవిష్కరించాలని రైతు వేదిక లను మున్సిపల్ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని చెరువు కట్టలపై ఈ ఉత్సవాలను పండుగ వాతావరణంల జరుపుకోవాలని వారు సూచించారు .ఈ ఉత్సవాలకు వెయ్యి మందికి పైగా హాజరై ఉత్సవాలను విజయవంత గా నిర్వహించాలని ఉన్నారు .ఉత్సవాలకు ప్రతి ఒక్కరు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ మాట్లాడుతూ ఆయా శాఖల అధికారులకు శాఖల వారీగా అన్ని రంగాలలో అభివృద్ధి పనులను గుర్తించి పనుల తీరుపై అధికారులకు అవార్డ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ బోర్డ్ వెల్ఫేర్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, గ్రంధాలయ చైర్మన్ చంద్ర గౌడ్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మన్సూర్ ,ఆత్మ కమిటీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, ఆయా మండలాల జడ్పిటిసిలు ఎంపిటిసిలు సర్పంచులు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై సమీక్ష సమావేశం

నవతెలంగాణ జగదేవపూర్: జగదేవపూర్ మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జూన్ 2 నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాలపై వివిధ గ్రామస్థాయి అధికారులతో మండల స్థాయి అధికారులతో సర్పంచ్ లతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బాలేశంగౌడ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు దశాబ్ది ఉత్సవాలను పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేవిధంగా చూడాలని అన్నారు. మొదటి రోజు నుంచి చివరి రోజు వరకు అన్ని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విధంగా పూర్తి చేయాలని తెలిపిపారు. జగదేపూర్ మండలం నియోజకవర్గంలోనే దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో ఆదర్శంగా నిలవాలని సూచించారు.వివిధ శాఖల అధికారులు సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి



నవతెలంగాణ దుబ్బాక రూరల్


దుబ్బాక మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా, వేగవంతంగా జరుగుతుందని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని గంభీర్పూర్, రామక్కపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన తర్వాత లారీల కొరతతో కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి ధాన్యం రవాణాకు లారీలను ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీపీ పుష్పలత మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వేగంగా కొనుగోలు ప్రక్రియ జరిగేటట్లు అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా తూకం వేసిన ధాన్యం బస్తాల రవాణాకు వాహనాల కొరత ఉన్నట్లయితే, తక్షణమే అక్కడికి లారీలను పంపిస్తున్నామన్నారు. అధికారుల, రైస్ మిల్లు యజమానుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ షేర్ల కైలాసం, బీఆర్ఎస్ నాయకులు కిషన్ రెడ్డి, సంగెపు స్వామి,చింతల ప్రభాకర్ తదితరులు ఉన్నారు

సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు



నవతెలంగాణ-పటాన్‌చెరు

నియోజకవర్గంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివద్ధి లక్ష్యంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని హజ్రత్ సయ్యద్ మురాద్ అలీషా దర్గా, హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షా దర్గా, చోటా మసీద్ ప్రాంగణాల్లో రూ.4.50 లక్షల సొంత నిధులతో ఏర్పాటుచేసిన 40 సీసీ కెమెరాలను సోమవారం స్థానిక నాయకులు, మైనార్టీ మత పెద్దలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, వీటి ద్వారా అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేయడంతో పాటు నేరాలను నియంత్రించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ లాలూ నాయక్, బి ఆర్ ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, ముస్లిం మత పెద్దలు లియాకత్ అలీ, వాజిద్ అలీ, అజ్మత్, ఇక్బాల్, మోయిన్, అతీక్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణికి 39 దరఖాస్తులు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ శరత్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పలువురు అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వారు తమ సమస్యలను విన్నవిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదులను అందజేశారు. గ్రీవెన్స్ హాల్లో రెవిన్యూ డివిజనల్ అధికారి అంబదాస్ ఫిర్యాదుదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ప్రజావాణికి మొత్తం 39 అర్జీలు రాగా, అందులో 12 రెవిన్యూ శాఖకు సంబంధించినవని, 27 ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మి నరసింహ డిజిటల్ ఫ్లెక్స్ ప్రింటింగ్‌ను ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మి నరసింహ డిజిటల్ ఫ్లెక్స్ ప్రింటింగ్‌ను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హాజరై సోమవారం ప్రారంభించారు. అందోల్ మండలం డాకూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు నాగరాజు డిజిటల్ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేటి యువత జీవన ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం కూడా యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పి. జైపాల్ రెడ్డి, జోగిపేట మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, వైస్ చైర్మెన్ ప్రవీణ్, మున్సిపల్ 3వ వార్డు కౌన్సిలర్ ఉలువల మాధవి వెంకటేశం, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఉలవల సతీష్, మాజీ మార్కెట్ చైర్మెన్ దిబీ. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ నుంచి కొత్తగా 3 డీలక్స్ బస్సు సర్వీస్‌లు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ బస్‌డిపోలో జహీరాబాద్ నుంచి హైదరాబాద్, బీదర్ వరకు నూతనంగా 3 డీలక్స్ బస్సు సర్వీస్‌లను ఎమ్మెల్యే మాణిక్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆర్టీసీ నూతనంగా అంది స్తున్న డీలక్స్ బస్సు సర్వీస్ ప్రయాణికులకు అన్ని సౌకా ర్యలు కలిపిస్తున్నదన్నారు. ప్రజలు ఆర్టీసీ సంస్థ యొక్క సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ ధరలకే కార్గో సేవలను కూడా అందిస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహియోద్దీన్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు ఇజ్రాయెల్ బాబీ, శివప్ప, లవాన్, ఉపేందర్ మరియు ఆర్టీసీ డిపో మనేజర్ రజినీ కృష్ణ మరియు సిబ్బంది, డ్రైవర్ లు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని ముంగి చౌరస్తాలో పోలీసుల విజ్ఞప్తి మేరకు ముంగి గ్రామ బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ షకీల్ రూ.60వేల తన సొంత డబ్బులతో 4 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాడు. ఈ సీసీ కెమెరాలను జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు.. జహీరాబాద్‌రూరల్ సీఐ సోముల వెంకటేష్, ఎస్సై వినయ్ కుమార్‌తో కలిసి రిబ్బన్ కట్ ప్రారంభిం చారు. సొంత నిధులతో ఇలా సీసీ కెమె రాలు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు భాస్కర్, రాజ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ఇమ్రాన్, శ్రీనివాస్, సర్పంచ్ లు నిరంజన్ రెడ్డి, మజీద్‌పటేల్, గౌస్,పాండురంగ రెడ్డి, శఫియోద్దిన్, వినోద్ పాల్గొన్నారు.

వెంకట లక్ష్మారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మా రెడ్డి మాతృమూర్తి గత మూడురోజులక్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సోమవారం స్వయంగా తాటిపల్లికి వెళ్లి బాధి త కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆ ర్ఎస్ రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్, పార్టీ మండలాధ్యక్షుడు విజయ్ కుమార్, సీనియర్ నాయకులు శివచంద్రకుమార్ పాటిల్, భాస్కర్ ఉన్నారు.

ఇందిరా పార్క్ ధర్నాకు తరలిన వీఏవోలు



పలుచోట్ల ముందస్తు అరెస్టులు

నవతెలంగాణ-వట్‌పల్లి

సమస్యల పరిష్కారం కోసం సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నాకు ఐకేపీ వీవోఏల రాష్ట్ర కమిటి పిలుపునిచ్చిన విషయం విధితమే. అయితే ధర్నాను భగ్నం చేసేం దుకు పోలీసులు ముందస్తు అరెస్టులకు చేసినప్పటికీ.. వారి అరెస్టులను పసిగ ట్టిన మండల వీవోఏలు ఉదయం 6 గంటల కంటే ముందే ఇంద్ర పార్క్‌కు చేరు కున్నారు. కాగా ధర్నాకు వెళ్లనీయకుండా అరెస్టులు చేయడం అప్రజాస్వా మికమన్నారు. 42 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ స్పందించని ప్రభుత్వం.. ఛలో ఇంద్ర పార్క్ ధర్నాను పోలీసులతో ఎందుకు అడ్డుకుంటున్నదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంజీవులు, నరేందర్ గౌడ్, కృష్ణ, ధనలక్ష్మి, రుక్మిణి, సావిత్ర, లక్ష్మి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

న్యాల్కల్‌లో ముందస్తు అరెస్టులు..



న్యాల్‌కల్ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సోమవారం నిర్వహించ తలపెట్టిన ధర్నాకు మండల వీవోఏలు తరలివెళ్తుండగా.. గంగ్వార్ చౌరస్తా వద్ద హద్నూర్ ఎస్సై వినయ్‌కుమార్ సిబ్బందితో కలిసి వీవోఏలను అందు పులోకి తీసుకున్నారు. అక్కడినుంచి వారిని హద్నూర్ పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. కాగా ప్ర భుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నాకు వెళ్తున్న 9 మం దిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో వీవోఏల మండలాధ్యక్షులు నాగేందర్, మోహన్, శ్రీనివాస్, మొగులప్ప, అలివేణి, జ్యోతి తదితరులున్నారు.

నకిలీ సోయాబీన్ విత్తనాల గుర్తింపు



నవతెలంగాణ-జహీరాబాద్

మొగుడంపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా సోయాబీన్ విత్తనాలను నిలువ చేసినట్టు గుర్తించి.. ఆ ఇంటిపై దాడిచేసి రెండు వందల బ్యాగుల విత్తనాలను స్వాధీన పరుచుకున్నట్టు చిరాకుపల్లి ఎస్సై కాశీనాథ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధనసిరి గ్రామానికి చెందిన ఒగ్గి సిద్దన్న అనే వ్యక్తి ఇంట్లో నకిలీ విత్తనాలు ఉన్నాయనే నమ్మదగిన సమాచారం మేరకు మొగుడంపల్లి మండల వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, చిరాగ్‌పల్లి ఎస్ఐ కాశీనాథ్‌లు సిబ్బందితో సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో అనధికారికంగా హీరా మోతి కంపెనీకి చెందిన 200 సోయాబీన్ విత్తనాల బ్యాగ్‌లను గుర్తించడంతో.. సిద్దన్నపై చట్ట ప్రకారం కేసు నమోదు చేసి విత్తన స్టాక్‌ను సీజ్ చేశారు. ఎవరైనా అనధికారికంగా విత్తనాలను అధిక మొత్తంలో ఉంచితే వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రైతులు కూడా సరైన లేబుల్, లాట్ నంబర్‌తో ఉన్న విత్తనాలనే మాత్రమే కొనుగోలు చేయాలని.. బిల్ తీసుకోవాలన్నారు.

వికలాంగుడికి నీలం మధు ముదిరాజ్ చేయూత



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని కన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కుమారుడు వికలాం గుడు రమేష్‌కు పటాన్చెరు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ చేయూత అందించారు. ఈశ్వరయ్య కుటుంబం కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో సోమవారం ఎన్ ఎం ఆర్ యువసేన ఆధ్వర్యంలో అతని ఇంటికి వెళ్లి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబం నీలం మధు ముదిరాజ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాద గౌడ్, .ఎన్.ఎం.ఆర్ యువసేన నాయకులు ప్రదీప్ రెడ్డి, ఆంజనేయులు, గ్రామ నాయకులు రమేష్ ముదిరాజ్, గోవర్ధన్ ముదిరాజ్, కే. రాములు ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలి



నవతెలంగాణ-హత్నూర

పార్లమెంట్ నూతన భవనానికి అంబేద్కర్ పేరు పెట్టాలని ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, దళిత రత్న అవార్డు గ్రహీత సాయమోళ్ళ నర్సింగ్ రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత పేరు పార్లమెంట్ భవనానికి పెట్టకపోగా.. ఆదివాసి బిడ్డ అయిన రాష్ట్రపతిని ప్రారంభోత్సవానికి పిలవకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి హోదాలో ఉన్న ఆదివాసి మహిళను ఆహ్వానించకపోవడం వల్ల భారత ప్రజలను అవమానించినట్లేనని.. రాబోయే కాలంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ దురంకారానికి చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయన్నారు. దళిత ఆదివాసి బహుజనులు అంత ఏకమై రాజ్యాంగ హక్కులను కాపాడు కోవాలన్నారు. భారత పార్లమెంటు భవనానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు నామకరణం తప్పనిసరిగా చేయాలని డిమాండ్ చేశారు.

అండూర్ రోడ్డు.. ఇక్కట్లు మెండు



- గుంతలు తేలిన రోడ్డుపైనే ఏండ్లుగా ప్రయాణం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణీకులు
- వెంటనే బాగు చేయాలని వేడుకోలు

నవతెలంగాణ-జిన్నారం

అడుగుకో గుంత ఏర్పడిన అండూర్ రోడ్డుపై ప్రయాణమంటేనే ప్రజలు గజగజ వణకుతున్నారు. కంకర తేలిన ఈ రోడ్డుపై నిత్యం ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏండ్లుగా ఈ దుస్థితి ఇలాగే కొనసాగుతున్నది. పేరుకు బి.టీ రోడ్డే అయినప్పటికీ.. గుంతలు, కంకర తేలి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే.. వాహనం ఏదైనా ఒళ్లు హూనమవడం మాత్రం పక్కా అని స్థానికులు చెబుతున్నారు. నిత్యం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనాలు తొందరగా దెబ్బతిని ఆర్థికంగా కూడా సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తే.. నిధులు మంజూరు అయ్యాయని చెబుతున్నప్పటికీ పనులు మాత్రం చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

అండూర్ గ్రామం ఇటు పటాన్‌చెరు మండలానికి, అటు జిన్నారం మండలానికి సరిహద్దు ప్రాంతంగా ఉంటుంది. అయితే దీంతోపాటు సోలక్‌పల్లి రహదారిని మొదలుకొని బేగంపేట మీదుగా జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణానికి ఈ దారి గుండా ఆర్టీసీ బస్సులను కొనసాగిస్తే... దాదాపు 20 గ్రామాల వారికి లబ్ది చేకూరుతుంది. అయితే ఈ రోడ్డు బాగున్నప్పుడు అండూర్ గ్రామానికి సంగారెడ్డి డిపో బస్సులు, జీడిమెట్ల డిపోకు చెందిన బస్సులు బాలానగర్, సికింద్రాబాద్ వరకు నడిచేవి. అయితే రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ఈ బస్సులు బంద్ అయిపోయాయి. దీంతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏండ్ల నుంచి ఇదే దుస్థితి నెలకొన్నా.. సంబంధిత అధికారులు పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మా రోడ్డుకు మహర్దశ ఎప్పుడో..



జిన్నారం మండలంలోని దాదాపుగా అన్ని గ్రామాల రోడ్లకు మంచి పరిస్థితి వచ్చినా.. మా అండూరు రోడ్డుకు మహర్దశ మాత్రం కలగడం లేదు. రోడ్డు పనులకు సంబంధించి నిధులు మంజూరు అయ్యాయి.. పనులు ప్రారంభమవుతాయి అనే మాటలు పక్కన పెడితే.. ఏండ్ల తరబడిగా గ్రామస్తులు పడే ప్రయాణపు బాధలు ఇంకా ఎందుకు గమనించడం లేదు. ఇప్పటికైనా స్పందించి వెంటనే రోడ్డు పనులు చేపట్టాలి.

-రవి గౌడ్, ఉప సర్పంచ్

రూ.1.58 కోట్లు మంజూరయ్యాయి

ఈ అండూర్ రోడ్డుకు సంబంధించి ఒక కోటి 58 లక్షలు మంజూరు అయ్యాయి. చిన్నకంచర్ల నుంచి అండూరు మీదుగా సోలక్పల్లి చౌరస్తా వరకు ఎనిమిది కిలోమీటర్ల గాను ఈ నిధులు సాంక్షన్ అయ్యాయి. అయితే 12 రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్ దశలవారీగా ఒకదాని తర్వాత మరొకటి పనులు చేపడుతున్నాడు. దీనిలో భాగంగానే నల్తూ రహదారి రీబీటీ పనులు పూర్తయ్యాయి.. మాదారం రహదారి పనులు కొనసాగుతున్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే ప్రధాన రహదారులను ముందు చేపడుతున్నాం.

- రవీందర్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ



దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర ప్రభుత్వం జూన్ 2 నుంచి నిర్వహించనున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని తాసిల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇండ్లు లేని వారిని గుర్తించి ఇండ్ల పట్టాలు అందజేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ఇతర ప్రభుత్వ పథకాల అమలుపై వారితో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాలు తహసీల్దార్లు వెంకటేశం, కిష్టయ్య, కమిషనర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-మునిపల్లి

కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులందరూ రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రైతుబంధు రానివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో)లకు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాఠశాల భవనం కోసం రూ.1.50కోట్ల సీఎస్ఆర్ నిధులు

- నాగార్జున కన్‌స్ట్రక్షన్ సంస్థ సౌజన్యంతో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల కేంద్రంలోని నాగార్జున కన్‌స్ట్రక్షన్ సంస్థ వారి సుమారు కోటి యాభై లక్షల సీఎస్ఆర్ నిధులతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మండల ప్రజా ప్రతినిధులతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగార్జున సంస్థ ప్రతినిధులను శాలువాతో సన్మానించారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపం లేకుండా పనిచేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యాసంస్థలకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అత్యున్నత హంగులతో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం అన్నారం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన కానుకుంట మాణిక్యం ఇండియన్ దాబాను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణ్ జ్యోతి, సర్పంచులు చిమ్ముల నరసింహారెడ్డి, అభిశెట్టి రాజశేఖర్, మేడిపల్లి మురళి, ఉప సర్పంచ్ మొగులయ్య, డి కుమార్, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, నక్క వెంకటేష్ గౌడ్, తుపాకుల రాజు, గోకర్ జయ శంకర్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, ఆలేటి సంజీవరెడ్డి, భద్రప్ప, నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమిస్తేనే.. వ్యవస్థాపకులుగా రాణించగలరు



- గీతం వీడీసీ కార్యశాలలో వక్తలు..

నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యవస్థాపకులుగా రాణించాలంటే, అనునిత్యం ఎదురయ్యే ఆటుపోట్లను అధిగమిస్తూ, సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నప్పుడే సాధ్యపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని వెంచర్ డెవలప్మెంట్ సెంటర్ (వీడీసీ) గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 'సమ్మర్ స్టార్టప్ స్కూల్‌లో భాగంగా.. సోమవారం 'కార్పొరేట్ కనెక్ట్, స్టార్టప్ సిమ్యులేటర్' కార్యక్రమాలను నిర్వహించారు. యువ పారిశ్రామికవేత్త క్రితీష్ కుమార్, అదానీ పోర్ట్స్, సెజ్ ఇన్నోవేషన్ మేనేజర్ సుబ్రమణ్యం నాడార్, ఇమ్మర్సిన్ సొల్యూషన్ ఎండీ, ముఖ్య కార్యనిర్వహణాధికారి రోషన్ రానల్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొని వర్ధమాన వ్యవస్థాపకులకు మార్గదర్శనం చేశారు. స్టార్టప్-కార్పొరేట్ ప్రపంచాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వారు తమ అనుభవాలు, నైపుణ్యాలను విద్యార్థులతో పంచుకోవడంతో పాటు పలు అంతర్దృష్టులను అందించారు. స్టార్టప్ - కార్పొరేట్ పర్యావరణ వ్యవస్థపై సంపూర్ణ అవగాహన కల్పించారు. ఆవిష్కరణ, వ్యవస్థాపకత, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, స్టార్టప్ - కార్పొరేట్ ఎకోసిస్టమ్ వంటి అంశాలను వారు వివరించారు.చివరగా, స్టార్టప్ సిమ్యులేటర్ నిర్వహించి, విజయవంతమైన స్టార్టప్‌ను నిర్మించే, అభివృద్ధి చేసే ప్రక్రియలో ఎదురయ్యే సవాళ్లను విద్యార్థులు స్వయంగా అనుభూతి చెందారు. ముఖ్యంగా వాటాదారులు విశ్లేషణ, స్వాట్ అనాలిసిస్ (బలాలు, బలహీనతలు, అవకాశాలు, అపాయాలు) పెట్టుబడిదారులతో అనుసంధానం వంటి సంక్లిష్ట అంశాలను వారికి నిశదీకరించారు. విభిన్న వ్యూహాల గురించి తెలుసుకోవడానికి, నిర్ణయాత్మక నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఇది విద్యార్థులకు ఎంతో ఉపకరిస్తుందన్నారు.

విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న సాయినాథ్



నవతెలంగాణ-సదాశివపేట

మండలంలోని మద్దికుంట గ్రామ తాండాలో సోమవారం జరిగిన శ్రీ భవాని మాత సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి యువ నాయకులు చింతా సాయినాథ్ హాజరై.. భవాని మాతా సేవలాల్ మహారాజ్‌ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవాని మాత సేవలాల్ మహారాజ్ ఆశీస్సులతో మద్దికుంట ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వేడుకున్నట్టు తెలిపారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంత త చేకూరు తుందన్నారు. ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, సదాశివపేట సొసైటీ వైస్ చైర్మెన్ పాండు నాయక్, ప్రజలు చింత సాయినాథ్‌ను శాలువా, పూలవాలలతో ఘనంగా సన్మాని ంచారు. కాగా అక్కడ బోరు సౌకర్యం లేదని నిర్వాహకులు, ప్రజలు ఆయన దృష్టికి తీసుకరాగా.. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, మద్దికుంట మాజీ సర్పంచ్ అరిఫోద్దిన్‌ని కోరగా ఆయన వెంటనే బోర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యమ్రకంలో పార్టీ మండలాధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు, సదాశివపేట మండలం మాజీ కో ఆప్షన్ సభ్యులు సలావొద్దీన్, పట్టణ పార్టీ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్ కుమార్ రమేష్ నాయక్, శ్రీనివాస్ నాయక్, ఎస్ విట్టల్, బన్యా నాయక్, రవి, సంగ్రామ్ నాయక్, పాండు, మేఘా తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జెండా.. పోరాటమే ఎజెండా

- టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

విద్యారంగ, సామాజిక సమస్యల ఎజెండాతోనే తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) పోరాడుతుందని, విద్యా, వైద్యం పేదలకు అందిననాడే సమాజం నిజమైన ప్రగతి సాధిస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్ అన్నారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సంద్భంగా సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్ ఎదుట టీపీటీఎఫ్ జెండాను ఎగురవేసి మాట్లాడారు. విద్యా ర్యరంగ సమస్యల సాధన కోసం 1983 నుంచి తెలంగాణలో టీపీటీఎఫ్ ఐఫియా మహాసభలు, ఫ్యాప్తో సమ్మె, రిలే నిరాహార దీక్షలు, చలో రాజభవన్, పాతిక వేల సంతకాలతో మహా ప్రదర్శన, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంయుక్త కార్యాచరణ సమితిగా చలో అసెంబ్లీ, సామాజిక సంక్షోభం - విద్యా విధానంపై విద్యా, వైజ్ఞానిక మహాసభలు, అపరిష్కృత సమస్యల సాధన కోసం సంచాలకులు కార్యాలయం ముందు ధర్నా, ప్రభుత్వ నిర్లక్ష వైఖరికి నిరసనగా సచివాలయం ముందు రిలే నిరాహార దీక్షలు, విద్యారంగ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిందన్నారు. 317 బాధితుల పక్షాన, 610 జీవో అమలుకోసం, నూతన జాతీయ విద్యా విధానం విద్య కార్పొరే టీకరణను వ్యతిరే కిస్తూ ఉద్యమాలూ చేపట్టిందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయుట కోసం, జూనియర్ పంచాయతీ కార్యద ర్శుల న్యాయమైన డిమాండ్ క్రమబద్దీకరణ కోసం మద్దతు గా నిలువటం లాంటి ఎన్నో పోరాటాలను టీపీటీఎఫ్ నిర్వ హించిందన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ సంజీవయ్య, ఖంరోద్దీన్, సీనియర్ నాయకులు భూమి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఏటా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి ఉపాధ్యాయ ఖాళీలు లేని పాఠశాలలుగా తీర్చిదిద్దాలన్నారు. మన ఊరు మన-బడి ద్వారా అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, స్కావెంజర్లను మళ్ళీ నియమించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల ఒకటవ తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి వేతనాలు అందించాలని, సంవత్సర కాలం నుండి పెండింగులో ఉన్న అన్ని రకాల బిల్లులను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విజయ్ భాస్కర్, మర్రి ప్రశాంతి, జిల్లా కార్యదర్శులు అశోక్ కుమార్, మల్లికార్జున్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జగన్నాథం, సభ్యులు సంతోష్ కుమార్, సోషల్ మీడియా కమిటీ సభ్యులు పుండరీకం, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ హేమలత, అకాడమిక్ సెల్ కన్వీనర్ సాయిలు చారీ, రిటైర్డ్ నాయకులు బుచ్చయ్య, బోజరాజ్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట



నవతెలంగాణ-పటాన్‌చెరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పల్లెను ప్రగతికి నిదర్శనంగా తీర్చిదిద్దుతున్నదని.. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో రూ.9 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహకారంతో సిఎస్ఆర్ నిధులను కేటాయిస్తూ గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నామన్నారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నీలం మధు, ఎంపీటీసీ లు మంజుల శ్రీశైలం, మాధవి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐనోలులో టొరెంట్ సీఎన్‌జి గ్యాస్ స్టేషన్ ప్రారంభం..

మండలం పరిధిలోని ఐనోలు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన టోరెంట్ సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్‌ను సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిఎన్జి గ్యాస్ వినియోగిస్తే డబ్బు ఆదా కావడంతో పాటు కాలుష్య తీవ్రతను తగ్గించవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంద్రేశం గ్రామ పరిధిలో ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు టోరెంట్ యాజమాన్యం శ్రీకారం చుట్టడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం గ్రామ సర్పంచ్ నరసింహ, బీఆర్ఎస నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పటాన్ చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, క్రైమ్ సీఐ లాలు నాయక్, టోరెంట్ గ్యాస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రావు, జనరల్ మేనేజర్ రాంబాబు, నాయకులు రామచంద్రా రెడ్డి, శంకర్‌రెడ్డి, శంకర్, నాయకులు పాల్గొన్నారు.

ధర్నాకు అనుమతిచ్చి.. అరెస్టులా?

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బీ.మల్లేష్, జి.సాయిలు



నవతెలంగాణ-సంగారెడ్డి

ఐకేపీ వీవోఏలా సమస్యలను పరిష్కరించాలని 42 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించక పోవడంతో.. సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. అయితే ధర్నాకు పోలీసుల నుంచి అనుమతి ఇచ్చినప్పటికీ.. ఈ ధర్నాకు వెళకుండా సంగారెడ్డి జిల్లాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జి. సాయిలు, సీఐటీయూ నాయకులను, ఐకెపి వీవోలను ఇంటి వద్దే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా అనుమతులున్న ధర్నాకు వెళ్లకుండా ఇలా అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. మల్లేష్, జి. సాయిలు అన్నారు. 42 రోజులుగా వీవోఏలు సమ్మె చేస్తుంటే.. సమస్య పరిష్కారించాల్సిన ప్రభుత్వం పోలీసులతో నిర్బంధాన్ని పెట్టి అణిచివేయడం సరైనది కాదన్నారు. 19 ఏండ్ల నుంచి వివో ఏలు ప్రభుత్వానికి సేవ చేస్తుంటే.. వారికి ఇచ్చే గుర్తింపు ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని.. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలి



నవతెలంగాణ-జోగిపేట

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పాటేల్ డిమాండ్ చేశారు. సోమవారం జోగిపేటలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎనిమిదేండ్ల నుంచి బదిలీలు, ప్రమోషన్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూలై 2023 నుంచి పిఆర్‌సి ని అమలు చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. పండిత్, పీఈటి పోస్టులను అప్గ్రేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సాయిలు చారి, అందోల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రప్రకాష్, సర్వరాజు అలీ, చంద్రశేఖర్, సంజీవయ్య, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




200 మందికి అంబలి పంపిణీ

నవతెలంగాణ-జోగిపేట

శ్రీ సత్యసాయి సేవా సమితి జోగిపేట ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్‌లో సోమవారం 200 మందికి 50 లీటర్ల అంబలి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల సౌకర్యార్థం.. వారి దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

నవతెలంగాణ
మెదక్
మంగళవారం 30 మే 2023



బ్యాంకులో పెంఛన్లలో కోత నిలిపివేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం



నవతెలంగాణ-మెదక్ టౌన్

బ్యాంకుల్లో క్రాప్ లోన్, ఇతర బకాయిల నిమిత్తం వృద్ధాప్య, ఆసరా పెన్షన్లలో కోత విధించే పద్ధతిని నిలిపివేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని వివిధ బ్యాంకులలో వృద్ధాప్య, ఆసరా పెన్షన్లు నిలిపివేస్తున్నారని బ్యాంకు ఇతర రుణాలకు కలిగిన వారి నుంచి వృద్ధాప్య, ఆసరా పెన్షన్లలో కోతలు విధిస్తున్నారన్నారు. దీని వల్ల వృద్ధులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పింఛన్ తోటే జీవనోపాధి సాగించుకుంటున్నారని వారి పెన్షన్ల నుంచి కోత విధిచడం సరైంది కాదన్నారు. పెన్షన్లలో కోతలు విధించే పద్ధతిని నిలిపివేయాలని బ్యాంకర్లకు తగు సూచనలు, ఆదేశాలు ఇవ్వాలని మల్లేశం కోరారు.

కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించిన ఎంపీపీ



నవతెలంగాణ-నర్సాపూర్

గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ ఖర్చులతో ఉచితంగా చేపడుతున్న కంటివెలుగు శిబిరంలో ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షులు, శివ్వంపేట ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచ్ తలారి శివులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ హరికృష్ణ మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. కంటివెలుగు కార్యక్రమంతో ఎంతో మందికి కంటి సమస్యలు తొలిగిపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గొల్ల భూమయ్య, మండల పార్టీ ప్రధానకార్యదర్శి తాటికొండ రాజశేఖర్ గౌడ్, డీలర్ శేఖర్ గౌడ్, వార్డు మెంబర్ కాలకంటి యాదగిరి, తాటికొండ నర్సింహా గౌడ్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు......

వీవోఏలకు కాంగ్రెస్ నాయకుల మద్దతు



నవతెలంగాణ-నిజాంపేట

43 రోజులుగా సమ్మె చేస్తున్న నిజాంపేట మండల వివోఏలను నిజాంపేట పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖండించారు. నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కన్న గారి లింగం గౌడ్ మాట్లాడుతూ సోమవారం హైదరాబాదులోని ఇందిరాపార్క్ దగ్గర తలపెట్టిన వివోఏలధర్నాకు బయలుదేరుతున్న వారిని నిజాంపేట పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. వివోఎల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. నిత్యం మహిళా గ్రూపులతో మమేకమై బ్యాంకు అధికారులకు గ్రూపులకు అనుసంధానంగా పనిచేస్తున్న వివోఏలకు రూ.26 వేల వేతనం ప్రకటించాలని, ఐడి కార్డులు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రూ.3900లు కుటుంబ పోషణకు సరిపోవడం లేదన్నారు. రాబోయేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని, తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, సేవాదళ్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కాకి రాజయ్య, వెంకటాపురం కుమ్మరి సిద్ధ రాములు, పంజా బాబు పాల్గొన్నారు

నస్కల్‌లో కంటి వెలుగు శిబిరం ప్రారంభం



నవతెలంగాణ-నిజాంపేట్

నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో సోమవారం కంటి వెలుగు శిబిరాన్ని మండల ఎంపీపీ దేశెట్టి సిద్ధ రాములు, సర్పంచ్ పంగ కవితలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు కులాలవారీగా ఎన్నో సంక్షేమ ఫలాలు తీసుకువచ్చిన కేసీఆర్ సమిష్టిగా గ్రామీణ ప్రాంతాలలో వయస్సు పైబడిన వాళ్లకు, చిన్న చిన్న కంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి కంటి పరీక్షలు చేసి ఉచితంగానే కంటి అద్దాలు అందివించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తీగల జ్యోతి, హెల్త్ సూపర్వైజర్ ఉజ్వల రాణి, డాక్టర్ సౌజన్య, ఆప్తల్ మిక్ సాగర్, కార్యదర్శి మమత, ఏఎన్ఎంలు రేణుక, కళ్యాణి, డి ఈ ఓ వాసవి వార్డు సభ్యులు కళావతి, మంజుల, నవీన్, ఎల్లం యాదవ్, వర్కర్లు సంతోష , రేఖ, పుష్పలత అంగన్వాడి టీచర్లు పద్మా మంజుల , గోదావరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ-నిజాంపేట

మండల పోలీస్ స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై మహిళలకు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అవగాహన కల్పించారు. మహిళలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా పరిచయం లేని వ్యక్తులు బ్యాంక్ అకౌంట్ నంబరు, ఫోన్ నెంబరు కానీ అడిగితే ఇవ్వకూడదని ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి వారం మండలంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామానికి ఒక కానిస్టేబుల్ ఇన్చార్జిగా ఉన్నాడని మీకు ఎలాంటి సమస్యలు ఉన్నా వారికి ఫోన్ చేసి మాట్లాడి మీ సమస్యలకు నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్స్ మహేష్ ఆపరేటర్ రాజు కృష్ణ నవీన్ సునీత తదితరులు పాల్గొన్నారు

వైభావంగా ప్రారంభమైన కోటమ్మ జాతర ఉత్సవాలు





నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండల పరిధిలోని బూర్గుపల్లిలో ఐదు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే కోటమ్మ జాతర ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సరిత మల్లేష్ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. మొదటి రోజు సోమవారం గ్రామ దేవతలకు దూప దీప నైవేద్యాలు, మంగళవారం అమ్మవారికి బోనాలు, బండ్లు ఊరేగింపు, బుధవారం లక్ష్మమ్మ పూజలు, గురువారం కోటమ్మకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. శుక్రవారం పసి బండ్లు ఊరేగింపుతో జాతర ఉత్సవాలు పూర్తి కానున్నాయని తెలిపారు. కావున జాతర ఉత్సవాలకు గ్రామ ప్రజలు సహకరించాలన్నారు. ఈ జాతరకు మండల పరిదిలోని అయా గ్రామాల భక్తులు, అల్లాదుర్గం, టేక్మాల్, రేగోడ్ మండలా భక్తులు కూడా పాల్గొంటారని తెలిపారు. జాతర సందర్భంగా గ్రామం లో విధిలైట్లు, త్రాగునీరు, ఆలయ కమిటీ వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చెంద్రయ్య, బేత్తయ్య, గంగారాం, కోటయ్య, సంగయ్య ఆర్ కే రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-మెదక్ టౌన్: ఉపాధ్యాయుల హక్కుల కోసం టిపిటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తోందని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, వెంటాక్రమిరెడ్డిలు తెలిపారు. టీపిటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మెదక్ పట్టణంలోని టిపిటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మెదక్ జిల్లాలో గత 40 వసంతాలుగా ఉపద్యాయ, సామాజిక ఉద్యమాలతో ప్రజలతో మమేకమై పని చేసిన సంఘం టీపిటీఎఫ్ అని వారు కొనియాడారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో ముందుండి ఉద్యమాన్ని నడిపించిన చరిత్ర టీపిటీఎఫ్‌కు ఉందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలతో పాటు సామాజిక న్యాయం కోసం పనిచేస్తున్న ఏకైక సంఘం టిపిటీఎఫ్ అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా అనేక సభలు, సమావేశాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేసిందన్నారు. ప్రతీ సందర్భంలో ఉపాధ్యాయుల పక్షాన, ప్రజల పక్షాన నిలబడి పోరాటం నిర్వహించిన సందర్భం టిపిటీఎఫ్‌కు ఉందన్నారు..ఈ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, దేవీ సింగ్, నజీర్, హీరా లాల్, సత్య నారాయణ నాయకులు సురేందర్ ,పీర్ సింగ్ , సత్య నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జీవ రత్నం తదితరులు పాల్గొన్నారు.

చేతికందే కరెంట్ తీగలు

- మా సమస్యను పరిష్కరించండి సారూ!
- సమస్యలను వివరించినా పరిష్కారం కాదు
- కొంత్త ఏఈ అయినా పట్టించుకుంటారా?





నవతెలంగాణ-నార్సింగి

"రైతే రాజు"" జై జవాన్ జై కిసాన్" "అన్నదాత సుఖీభవ" ఈ మాటలు రైతుల గురించి ప్రస్తావించినప్పుడు అందరూ చెప్పేవే, ఇవి వినడానికి, చెప్పడానికి సొంపుగా ఉంటాయి. ఏ పని చేసే వారికైనాగానీ నిర్ణీత పని గంటలు ఉంటాయి. అతను పెద్ద ఆఫీసర్ అయినా లేక కూలి పని చేసుకునేవాడైనా. అంతే. కానీ రైతు పగలనకా రేయనకా, ఏండనకా వాననకా కష్టపడుతూనే ఉండాలి. అలా కష్టపడి మనకు ఆహారం అందించే రైతులకు ఎన్నో ఆటంకాలు కలుగుతుంటాయి. ఒక్కోసారి ప్రకృతి కన్నెర్ర చేస్తే ఒక్కోసారి అధికారుల నిర్లక్ష్యం వారికి శాపంగా మారుతుంది. ప్రకృతి వైపరీత్యాలను ఎలాగో నిలవరించలేము, కానీ నిర్లక్ష్యపు అధికారుల మాటేంటి? నార్సింగి మండల కేంద్రం నుంచి శాలీపేట్ గ్రామానికి వెళ్లే దారిలో పొలాలు కలిగిన రైతులు అధికారుల నిర్లక్ష్యానికి బాధితులు అవుతున్నారు. పొలాల్లో నుంచి విద్యుత్ తీగలు ఒక్కోచోట చేతికందే ఎత్తులో ఉంటే ఒక్కో చోట నిలబడితే నెత్తికి తాకేటంతగా కిందికి వేలాడుతున్నాయి. రైతులు కోతలు చేయాలన్నా హార్వెస్టర్ వచ్చే పరిస్థితి లేదు. కనీసం దున్నడానికి ట్రాక్టర్లు రావడం కూడా కష్టంగా మారింది. చివరకు వరి తరలించాలన్నా గడ్డివాములు తరలించాలన్నా రైతులకు కష్టాలు తప్పడం లేదు. గత మూడు పంటల కాలం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా తమ సమస్యలకు పరిష్కారం లభించడం లేదని శాలీపేట రోడ్డు పరిసర ప్రాంత రైతులు వాపోతున్నారు. ఎన్నోసార్లు నార్సింగి మండల కేంద్రం విద్యుత్తు ఏఈకి ఫోటోలు చూయించినా స్పందన రావడంలేదు. ఏఈ బదిలీ అయినా తమ సమస్య మాత్రం అలాగే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చిన ఏఈ అయినా తమ కష్టాలను తీర్చాలని రైతులు కోరుతున్నారు.

ఫోటోలు, వీడియోలు చూయించినా ఫలితం లేదు

ధరావత్ లక్ష్మణ్, కౌలు రైతు.



గత మూడు పంటల నుంచి మాకు ఇదే పరిస్థితి ఇది నాలుగవ పంట. ఫోటోలు, వీడియోలు తీసుకుని విద్యుత్తు అధికారకారులకు చూపించాము. కానీ ఇప్పటివరకు మా సమస్యను పరిష్కరించలేదు. మా ప్రాణానికి ప్రమాదంగా ఉంది. పొలంలో తిరగాలన్నా, బోరు వేయాలన్నా విద్యుత్ తీగల వల్ల మాకు భయంగా ఉంది. ట్రాక్టర్లు, హార్వెస్టర్లు రావడానికి కూడా ఇబ్బందిగా ఉంది. తాము వేరే ఊరు నుంచి బతకడానికి వచ్చి పొలం కౌలుకు తీసుకొని పండిస్తున్నాము. విద్యుత్తు తీగలు తాకి ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు? అధికారులు వెంటనే స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

వ్యవసాయం చేయాలంటే భయంగా ఉంది

నరసింహారెడ్డి రైతు నార్సింగి.



గడిచిన రెండు సంవత్సరాలలో ఈ విద్యుత్ తీగల సమస్య అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకుపోయాము. గతంలో కూడా ఇక్కడ ఒక రైతు విద్యుత్ షాక్ కు గురై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. రెండేళ్ల నుంచి ఎన్నిసార్లు వైర్లను బిగించమని చెప్పినా వారు మాత్రం చేయడం లేదు. నిలుచుంటే తగిలే ఎత్తులో వైర్లు ఉన్నాయి. ట్రాక్టర్లు రాక హార్వెస్టర్లు రాక, ప్రతి పనికి కూలీలపై ఆధారపడాల్సి వస్తుంది, దీంతో పెట్టుబడి పెరిగిపోతుంది. మాకు ఇక్కడ వ్యవసాయం చేయాలంటే చాలా భయంగా, బాధగా ఉంది. ఈ సమస్యను అధికారులు తొందరగా పరిష్కరించి తమను ఆదుకోవాలి.

ఏఈ బదిలీ అయినా తీరని సమస్య

జమీర్ ఖురేషి, 5వ వార్డు సభ్యుడు, నార్సింగి.



రైతులు దాదాపు రెండు సంవత్సరాలుగా పంటల కోతల సమయంలో విద్యుత్ తీగల సమస్య గురించి తన వద్దకు వస్తున్నారు. నేను వారితో పాటుగా చాలాసార్లు విద్యుత్తు ఉపకేంద్రానికి వెళ్లి సమస్య పరిష్కరించమని కోరాను. ఇక్కడి పరిస్థితిని ఫోటోలతో సహా వీడియోలతో సహా వివరించాను. ప్రతిసారి పరిష్కరిస్తామనడమే గాని పరిష్కరించడం లేదు. మూడు నెలల క్రితం పాత ఏఈ బదిలీ అయ్యి కొత్త ఏఈ వచ్చారు. ఆయన దృష్టికి కూడా సమస్యను తీసుకు వెళ్లాను. రైతులకు కలుగుతున్న ఈ ఇబ్బందిపై ఏఈ వెంటనే చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా వారి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాను.



ఒకటి, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తా

సిహెచ్ స్వామి, ఏఈ. నార్సింగి.



నార్సింగి మండలంలో విద్యుత్ తీగల సమస్య ఉన్న మాట వాస్తవం. నార్సింగి కేంద్రానికి బదిలీ అయి వచ్చినప్పటి నుంచి దాదాపు 50 చోట్ల విద్యుత్ తీగలను బిగించడం జరిగింది. కొన్నిచోట్ల మిడిల్ పోల్స్ వేయాల్సిన అవసరం ఉంది. ఒకటి రెండు రోజులలో 100 పోల్స్ రావాల్సి ఉన్నాయి. అవి రాగానే అవసరం ఉన్న చోట పోల్స్ వేయించడం లేదా తీగలను బిగించడం జరుగుతుంది. వెంటనే లైన్మెన్‌ను పంపించి సైడ్ ఇన్నెక్షన్ చేయించి మిడిల్ పోల్స్ అవసరం ఉన్నాయా లేదా విద్యుత్ తీగలు బిగించాల్సి ఉంటుందా లేదా కనుక్కొని, సమస్యను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను.

రక్తం చిందిస్తున్న 765డి రహదారి

- మే నెలలోనే 8 మంది మృతి, 15 మంది చికిత్స పొందుతున్నారు
- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంగా రహదారి నిర్మాణం
- రాజకీయ నాయకుల మౌఖిక ఆదేశాలతో ఇష్టారీతిన రహదారి నిర్మాణం
- రోడ్డు మధ్యలో డివైడర్ వేయాలని డిమాండ్





నవతెలంగాణ-కౌడిపల్లి

రక్తం చిందిస్తున్న 765 డి రహదారిపై గత కొన్ని రోజులుగా రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. గత నాలుగు సంవత్సరాల క్రితం హైదరాబాద్ టు మెదక్ లింక్ రోడ్డు ఉండడంతో వాహనాల రద్దీ పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థన మేరకు కేంద్ర మంత్రి రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గట్కరి ఆదేశాల మేరకు గండి మైసమ్మ టు మెదక్ 765డి రహదారి మంజూరు అయింది. కాగా గుత్తేదారుల ఇష్టారాజంగా రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా చేసినప్పటికీ ఒక కిలోమీటర్ మేరకు రోడ్డు మూలమలుపులు లేకుండా ఉండాల్సిన రోడ్డు గతంలో మెదక్ టు హైదరాబాద్ లింకు రోడ్డు ఎలా ఉండెనో అలాగనే రోడ్డును నిర్మాణం చేశారు. గుమ్మడిదల మెదక్ వరకు అడవి శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో మూల మలుపులు తీయకపోవడంతో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో అనుమతులను తుంగలో తొక్కి వారి ఇష్టారాజంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 765 డి రహదారిలో కిలోమీటర్ వరకు రోడ్డు ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా ఉండాలని నిబంధనలో ఉన్నా ఎక్కడ అది గుత్తేదారులు పాటించకపోవడంతో గుత్తేదారులు, నాయకులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా రోడ్డును నిర్మించారు. గుమ్మడిదల నుంచి గండి మైసమ్మ వరకు మధ్యలో డివైడర్ ఉండడంతో అక్కడ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగడంలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. గుమ్మడిదల నుంచి మెదక్ వరకు డివైడర్ లేకపోవడంతో వాహనాలు ఓవర్ టెక్ చేయబోయి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రహదారుల మూలమలుపు దగ్గర సూచిక బోర్డులు లేకపోవడం సంబంధిత శాఖ నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ మే నెలలోనే కౌడిపల్లి మండల పరిధిలో రోడ్డు ప్రమాదాలకు సూరారం గ్రామానికి చెందిన నాగలింగ రాజు, వెంకట రమణమ్మ, వైశాలి, కంచన్పల్లి గ్రామానికి చెందిన స్వరూప, శ్రీలేఖ, కౌడిపల్లి గ్రామానికి చెందిన నగేష్ గౌడ్, మనంతాయపల్లి తండాకు చెందిన సదల్లా శ్రీకాంత్, అంతారం గ్రామానికి చెందిన మహేష్, మృతి చెందారు . ఆసుపత్రులలో15 మంది చికిత్స పొందుతున్నారు. కౌడిపల్లి మండల పరిధిలోని దేవులపల్లి, హరిచంద్ తండా, వరిగుంతం గ్రామాలకు చెందిన వారు నిత్యం 100 నుంచి 200 మందికి పైగా కౌడిపల్లి కి వస్తుంటారు. వారికి హైవే దగ్గరకు రాగానే యూటర్న్ దూరంగా ఉండడంతో రాంగ్ రూట్లో వెళ్లి రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు, రోడ్డు ప్రమాదాలు జరగకుండా 765డి రహదారి మధ్యలో త్వరగా డివైడర్ వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

హైవే పోలీస్ నిర్లక్ష్యం

రోడ్డు ప్రమాదాల దారిదోపిడి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హైవేలపై పోలీసులు పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేసినా రోడ్డు ప్రమాదాలు జరిగిన గంటల సమయంలో కూడా రావడంలేదని విమర్శలు ఉన్నాయి. హైవే పోలీసులు నిర్లక్ష్యం వల్లనే రోడ్డు ప్రమాదాల్లో బాధితుల సంఖ్య పెరుగుతుందని పేర్కొనవచ్చు.

765 డి రహదారిపై 40 నుంచి 60 కి.మీ.ల స్పీడ్

ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి



765డి రహదారిపై గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల స్పీడ్ మాత్రమే వెళ్లాలని ఎస్ఐ శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఆయన తెలిపారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే చోట్లను గుర్తించి పై అధికారుల ఆదేశాల మేరకు హైవే రోడ్డుపై వైట్ బ్రేకర్లు వేయిస్తామని తెలిపారు.

జూన్ 11న కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవ తెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 11న కలెక్టరేట్‌లో కవి సమ్మేళనం ఏర్పాటు చేసున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణా సాధించిన ప్రగతి అనే అంశాలపై తెలుగు, ఉర్దూ భాషలలో కవితలను రాసి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీలను జూన్ 7న సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీ పరిశీలించి ఎంపిక చేసిన వాటికి మాత్రమే జూన్ 11న నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనుటకు ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. అందులో ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేసి నగదు పురస్కారంతో సత్కరిస్తామన్నారు. జిల్లాలో ఆసక్తి గల కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ స్వీయ రచనలను పంపవలసినదిగా సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి (8328599157)ని సంప్రదించచాలని కలెక్టర్ సూచించారు.

ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల నేతలపై మోడీ కక్షసాధింపు

- పార్లమెంటు భవనం ప్రారంభోత్సవం వివాదాస్పదం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీల నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, ఈడీ, ఐటీ అధికారుల చేత దాడులు చేయిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం హుస్నాబాద్ సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత పార్లమెంట్ నూతన భవనం ప్రారంభోత్సవం వివాదాస్పదంగా మారిందని, బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలని ప్రతిపక్షాలు చెప్పినప్పటికీ మోడీ పట్టించుకోలేదన్నారు. నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ ఎన్నికల ముందు ప్రజలను ఆకర్షించడానికి అనేక పథకాలను ప్రకటిస్తూ గద్దెనెక్కి హామీలు మరిచారన్నారు. కేసీఆర్ పేదలందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు, ఇండ్ల స్థలాలు , నిరుద్యోగ భృతి, పెన్షన్, సంక్షేమ పథకాలను అమలు చేసేంతవరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలను కొనసాగిస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, గడిపె మల్లేశ్, ఎడల వనేష్, జాగీర్ సత్యనారాయణ, బద్దిపడగ రాజారెడ్డి, సంజీవరెడ్డి, ఏగ్గొజు సుదర్శన్ చారి, కొహెడ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో వివోఏలు అరెస్టు



నవతెలంగాణ-నిజాంపేట

వీవోఏలు దాదాపు 43 రోజుల నుంచి నిరసన దీక్షలు, సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం వివోఏల సమస్యల ను పట్టించు కోవడంలేదని వివోఎలు లలిత రేణుక అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాదులో ఇందిరా పార్కు వద్ద జరిగే వివోఎలా ధర్నాకు తరలి వెళ్తున్న తమను పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమైన విషయమన్నారు. 43 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. రూ.3900 వేతనాలతో కుటుంబ పోషణ భారం అవుతుందని రూ.26 వేల వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రభుత్వ బ్యాంకులకు గ్రామాలలోని మహిళా గ్రూపులకు అనుసంధానంగా పనిచేస్తున్నామన్నారు. ఉద్యోగ భద్రత ఐడి కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు తీరేవరకు ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వివోఏల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కవిత, సునీత, రేణుక,పద్మ రజిత సుజాత, పోలీస్‌లు మహేష్, కృష్ణ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ ప్రారంభం



నవ తెలంగాణ-కొండపాక : సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో జిల్లా ఖజానా శాఖ వారి స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్ ప్రారంబించారు. ఈ స్ట్రాంగ్ గదిని ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు అధునాతన పద్ధతిలో అత్యంత పకడ్బందీగా నిర్మించారు. ఖజానా శాఖ విభాగంలో ఫైల్ లకు మంచి భద్రతతో కూడినదిగా స్ట్రాంగ్ రూమ్ నిర్మించినందుకు ఇంజనీరింగ్, ఖజానా శాఖ అధికారులను కలెక్టర్ అబినందించారు. ఈ ప్రారంభోత్సవంలో జిల్లా ఖజానా శాఖ అధికారి (ఇంచార్జి) జగదీష్ సింగ్, ఆర్ అండ్ బి బిఈ రాము, ఖజానా శాఖ బృందం తదితరులు పాల్గొన్నారు.



మూడు మిల్లులున్నా.. ధాన్యం తీసుకోవడం లేదు

- రాజీవ్ రహదారిపై ధాన్యం బస్తాలతో తోటపల్లి రైతుల బైఠాయింపు



నవతెలంగాణ-బెజ్జంకి

గ్రామ శివారులో మూడు రైస్ మిల్లులున్నా ధాన్యాన్ని తీసుకోవడం లేదని, రైస్ మిల్లుల యజమానుల తీరును నిరసిస్తూ సోమవారం మండల పరిధిలోని తోటపల్లి గ్రామ రైతులు రోడ్డెక్కారు. రైతులు ధాన్యం బస్తాలతో తోటపల్లి స్టేజ్ రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. కొనుగోలు కేంద్రాల నిబంధనలను పాటిస్తూ ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నా కోతలు విధిస్తూ యజమానులు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ప్రవీణ్ రాజు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సూచించడంతో రైతులు నిరసనను విరమించారు.

బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలి



నవతెలంగాణ-తొగుట: విద్యార్థి, యువజన, సోషల్ మీడియా అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని యూత్ మండల అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో యూత్ మండల అధ్యక్షుని ఆధ్వర్యంలో బీఆర్ఎస్ గ్రామ యూత్,విద్యార్థి సోషల్ మీడియా కమిటీలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వివిధ విభాగాలలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ యూత్ కమిటీ అధ్యక్షుడిగా బరెంకాల కర్ణాకర్, ఉపాధ్యక్షులుగా దూలం నవీన్, బరెంకల దయాకర్,విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షులుగా లింగాల ప్రశాంత్, సోషల్ మీడియా అధ్యక్షుల చిక్కుడు రాజు, ఉపాధ్యక్షులుగా గుడిసె బాబులను ఎంపిక చేశామ న్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ లింగాల శ్రీలత స్వామి, వార్డు సభ్యులు జలీల్, బోయిని బాలరాజు, గ్రామ అధ్యక్షుడు చెరుకు లక్ష్మా రెడ్డి, ఉపాధ్యక్షుడు వంగ కనకయ్య, సీనియర్ నాయకులు చిక్కుడు రమేష్, చిక్కుడు శ్రీనివాస్, లింగాల శ్రీనివాస్, చింత భైరా రెడ్డి, యువ నాయ కులు రమేష్ గౌడ్, కృష్ణ,శేఖర్, కొల శ్రీకాంత్ గౌడ్, అశోక్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఆడ కూతురు పెళ్లికి జుబేర్ పాషా ఆర్థిక సహాయం



నవతెలంగాణ-ములుగు

మండల పరిధిలోని దాసర్లపల్లి గ్రామానికి చెందిన మైలారం యాదమ్మ కూతురు అఖిల పెండ్లికి ఏ టు జెడ్ ఫౌండేషన్ చైర్మన్ టిఆర్ఎస్ రాష్ట్ర యువత విభాగం ఉపాధ్యక్షులు జుబేర్ పాషా రూ.పది వేల ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సహాయం అందించినందుకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మన్నే శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు

పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలి



నవతెలంగాణ-గజ్వేల్

టిపిటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ జోన్ కార్యాలయం వద్ద జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ టిపిటిఎఫ్ జెండా ను ఎగురవేశారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు నరెందర్, మల్లికార్జున్, రాజులు మాట్లాడుతూ జులైలో పి ఆర్ సి గడువు ముగుస్తున్నందున పెండింగ్ లో వున్న ముడు డిఏ లు విడుదల చేస్తూ, నూతన పి ఆర్ సి కమిటి ని నియమించాలన్నారు. ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులు అన్ని క్లియర్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు గత ఎనిమిది సంవత్సరాల నుండి ప్రమోషన్లు, ఐదు.సంవత్సరాల నుండి బదిలీలు లేక నష్టపోతున్నారని వెంటనే ప్రమోషన్ ల తో కూడిన బదిలీలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రాంచంద్రం,వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పాపిరెడ్డి,పర్వతం నర్సయ్య,సత్తయ్య, రాములు, జిల్లా కౌన్సిలర్లు ఎల్లయ్య, కరుణాకర్, మల్లయ్య, ఉపాధ్యాయలు, శ్రీనివాస్ రెడ్డి,నర్సింలు గౌడ్, మల్లేశం, వేణు, సంతోష్, కృష్ణ, శ్రీనివాస్ నర్సింగ రావు, తులసి దాసు, దయానంద్ ఆంజనేయులు, వెంకట్, భాస్కర్, ఖాజా, నర్సింలు, నరేందర్, వేణు, శ్రీనివాస్ గౌడ్, కృష్ణ, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-సిద్దిపేట

యశోద హాస్పిటల్ సికింద్రాబాద్, వాసవి క్లబ్స్ సిద్దిపేట సంయుక్త ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఈ నెల 30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం3 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని వాసవి క్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గుండె, మెదడు, నరాలు, ఎముకలు, అంకాలజీ, సాధారణ వ్యాధులు, పీడియాట్రిక్స్ సంబంధించిన డాక్టర్లు వస్తారని తెలిపారు. పట్టణంలోని అన్నపూర్ణేశ్వరి గుడి వద్ద గల శారద నికేతన్ హై స్కూల్ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వాసవి క్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్-సరోజల వివాహ వార్షికోత్సవ సందర్భంగా పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ అధ్యక్షులు చింత రాజేంద్ర ప్రసాద్, తొడుపునూరి కృష్ణవేణి, అరవపల్లి హరికిరణ్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి బూరుగు వేణుగోపాల్, పీఆర్వో అయిత శంకర్, చింత సరోజ పాల్గొన్నారు.

యువత స్ఫూర్తి కోసమే రాజీవ్ గాంధీ క్విజ్ పోటీలు

- కరపత్రాలను ఆవిష్కరించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-బెజ్జంకి

రాబోయే రోజుల్లో పోటీ పరీక్షల వైపు దృష్టి మరల్చి యువతలో స్ఫూర్తి నింపడానికి రాజీవ్ గాంధీ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కరీంనగర్ డీసీసీ కార్యదర్శి వెన్నం రాజమల్లు తెలిపారు. జూన్18న నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్ లైన్ క్విజ్ పోటీల కరపత్రాలను సోమవారం మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఆసక్తి గల18 నుండి 35 ఎండ్ల వయస్సున్న వారు జూన్ 17 వరకు 7661899899 ఫోన్ నంబర్లో సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని వెన్నం రాజమల్లు సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి, నాయకులు రొడ్డ మల్లేశం, రాములు, మంకాలి ప్రవీణ్, డీవీరావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవానికి తరలిరావాలి



నవ తెలంగాణ-సిద్దిపేట

బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఆలయ అర్చక, ఉద్యోగస్తులు, దూప దీప నైవేద్య అర్చకులు, బ్రాహ్మణ బంధువులు అందరూ హాజరు కావాలని జిల్లా అర్చక ఉద్యోగుల సంఘం నాయకులు కలకుంట్ల కృష్ణమాచార్యులు, కలకుంట్ల వెంకట నరసింహ చార్యులు, చంద్రకుమార్ కోరారు. సోమవారం సిద్దిపేటలో వారు మాట్లాడుతూ మే 31న గోపన్ పల్లి రంగారెడ్డి జిల్లాలో రూ 12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ పరిషత్ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారని తెలిపారు. బ్రాహ్మణులకు ప్రతి బడ్జెట్ లో 100 కోట్లు కేటాయించే విధంగా బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేశారని, కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణులకు విద్యారుణాలు, వ్యాపార రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ వ్యవస్థ ద్వారా అర్చక ఉద్యోగులకు వేతనములు చెల్లిస్తున్నారని, అలాగే ప్రతి గ్రామంలో దూప దీప నైవేద్యం ద్వారా నెలకు రూ 6వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. భవన ప్రారంభోత్సవానికి హాజరుకానున్న సీఎం కెసిఆర్, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, దేవదాయ శాఖ మంత్రి ఇంద్ర కిరణ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రములో అర్చక కార్యదర్శి సి. హెచ్ వెంకట నరసింహచా ర్యులు, రాజు పంతులు, మహేష్ పంతులు, శ్రీకాంత్ రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆగిన గ్రంథాలయం మరమ్మతు పనులు



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ కేంద్రంలో కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన గ్రంథాలయ భవనం ఈ మధ్యకాలంలో కుంగిపోవడంతో మరమ్మత్తుల కోసం జిల్లా గ్రంథాలయం నుంచి రూ.9.20 లక్షలను మంజూరు చేశారు. ఫిబ్రవరి నెలలో మరమ్మత్తు పనులను కాంట్రాక్టర్కు అప్పగించారు. ఆ కాంట్రాక్టర్ భవనం లోపల కుంగిపోయిన బండలను తొలగించి మట్టిని పోయించాడు తప్ప అప్పటి నుంచి ఇప్పటివరకు మిగతా పనులు మాత్రం చేయకుండా కాలయాపన చేస్తున్నాడు. దీంతోపాటు తాళం చెవి కాంట్రాక్టర్ వద్దనే ఉండడంవల్ల గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు గ్రంథాలయం మూసి ఉండడాన్ని చూసి వెనుదిరిగి పోతున్నారు. వెంటనే మరమ్మతు పనులను చేపట్టి పూర్తి చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై లైబ్రరియన్ రాంరెడ్డిని అడగ్గా కాంట్రాక్టర్ వల్లనే పనులు నిలిచిపోయాయని, ఆ కాంట్రాక్టర్ను పిలిచి మాట్లాడుతామన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి





నవతెలంగాణ-కొండపాక

ప్రజావాణి గొప్ప కార్యక్రమమని, ఇందులో వచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనప కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్కు విన్నవించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని సూచించారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్ళు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 57 దరఖాస్తులు వచ్చాయి.కార్యక్రమంలో డిఆర్ఓ లక్ష్మి కిరణ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం అక్కెనపల్లి శివారు మోయ తుమ్మెద పెద్ద వాగు నుంచి రాత్రి వేళల్లో తరలిస్తున్న అక్రమ ఇసుక మాఫియాను అడ్డుకోవాలని అక్కెనపల్లి సర్పంచ్, గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాత్రి సమయంలో ఇసుక దళారులు దౌర్జన్యంగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక మాఫియాను అడ్డుకునే ప్రయత్నాలు చేసినప్పటికీ రైతులపై ఇసుక దళారులు దాడులకు సైతం పాల్పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై రాజగోపాల్ పేట ఎస్ఐ,నంగునూరు తహసీల్దార్కు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇసుక అక్రమ రావాణాను అడ్డుకోవాలని గ్రామసభలో ప్రజలందరూ కలిసి తీర్మానించి, కలెక్టరేట్ లో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిప్పని నాగేందర్, గ్రామ ఉప సర్పంచ్ జక్కిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, రైతులు గొర్ల బిక్షపతి, పాతూరి మల్లారెడ్డి, అర్సం కర్ణాకర్, శ్రీమంతుల శ్రీనివాస్, గుడికందుల శ్రీనివాస్, కెత్తె రాజేందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టి పి టి ఎఫ్ రాష్ట్ర నాయకులు పొనమల్ల రాములు, జి.తిరుపతి రెడ్డి, యస్ కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టిపిటిఎఫ్ పదవ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సిహెచ్ విజేందర్ రెడ్డి టిపిటిఎఫ్ జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీపిటీఎఫ్ నిరంతరం విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు.8 సంవత్సరాలుగా ప్రమోషన్లు లేక, ఐదు సంవత్సరాలుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎంఈఓ , డిప్యూటీ ఈవో , లెక్చరర్స్ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ ఆంధ్రాలో జరిగిన ఒప్పందం ప్రకారం తెలంగాణలో పరిష్కారం చూపాలన్నారు. మూడు డి ఎ లను తక్షణమే విడుదల చేయాలని, జూలైలో వేతన సవరణ గడుపు ముగుస్తున్నందున వెంటనే పీఆర్సి కమిటీ వేయాలన్నారు. మన ఊరు మనబడి పథకం అన్ని ప్రభుత్వ పాఠశాలలో మంజూరు చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఎస్ జి టి లకు ప్రమోషన్లు కల్పించి, భాషా పండితుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉదయం పూట విద్యార్థులకు ప్రభుత్వం అల్పాహారం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పాలు ,పండ్లు కూడా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్స్ యండి జమీర్ మోహియోద్దీన్, ఆర్ పద్మయ్య, జి.జానకి రాములు, జె.విష్ణువర్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. సత్యనారాయణ, పి జనార్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు కె. తిరుపతి, ఆర్ మల్లేశం, యండి.మహమూద్, పి సత్య కృష్ణ, జి శివాజీ, నాయకులు జి. విష్ణు, పి.శ్రీనివాస్ గౌడ్, పి.చంద్రశేఖర్, జి.లింగారెడ్డి,బి.నరేష్ పి.హరికృష్ణ, పి.సతీష్ రెడ్డి, కె.శ్రీనివాస్,యస్ పద్మా రెడ్డి, భగవాన్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



నవతెలంగాణ-నంగునూరు

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఉమ్మడి మెదక్ జిల్లా జేఏసీ నాయకురాలు దేవులపల్లి బాల్ నరసవ్వ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్స్, కారోబార్స్, బిల్ కలెక్టర్స్, స్వీపర్స్, ఎలక్ట్రిషియన్స్, వాటర్ మెన్, డ్రైవర్స్ తదితరులు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ జేసీసీ ఆధ్వర్యంలో నంగునూరు మండల ఇంచార్జి ఎంపీడీఓ వేణుగోపాల్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకురాలు దేవులపల్లి బాల్ నర్సవ్వ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరాలన్నారు. గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న సిబ్బంది మొత్తాన్ని పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన మినిమమ్ బేసిక్ వేతనంగా చెల్లించాలన్నారు. ఆలోపు జీవో నెం. 60 ప్రకారం స్వీపర్లకు రూ. 15,600, బిల్కలెక్టర్, కారోబార్లకు రూ.19500- వేతనంగా నిర్ణయించాలన్నారు. ప్రతీ నెలా రెగ్యులర్ గా వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని, జీవో నెం.51ను సవరించాలన్నారు. ప్రతీ వర్కర్కు ఇన్సూరెన్స్ రూ.5 లక్షలు అమలుచేయాలన్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలన్నారు. వయస్సు మీరిందనే సాకుతో కార్మికులను మారిస్తే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, ఏడాదికి 3 జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలన్నారు. వాటికి నగదు రూపంలో అలవెన్సులు చెల్లించాలన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి. 8 గంటల పనిదినాన్ని అమలుచేయాలి. ఆదివారం, పండుగ సెలవులు, జాతీయ, అంతర్జాతీయ సెలవు దినాలను అమలుచేయాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు దేవులపల్లి రాజమౌళి,వెంకట్ నర్సు,చిట్యాల కనకయ్య, అంకని పర్శరాములు, దేవులపల్లి రాజు,కళవ్వ, దేవవ్వనర్సింలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల ఊసే ఎత్తని నరేంద్ర మోడీ



నవతెలంగాణ-నంగునూరు

నరేంద్ర మోడీ అధికారంలోకి రాక ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నేడు ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని బీఆర్ఎస్వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు మెరుగు మహేష్, మండల పరిశీలకులు భూక్యా బిక్షపతి నాయక్, అధ్యక్షులు గోవిందారం రవి పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట నియోజకవర్గం నంగునూరు మండలంలోని రాంపూర్, మగ్దుంపూర్ గ్రామాలలో బిఆర్ఎస్వీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు స్థాపించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎత్తివేసి ఉన్న ఉద్యోగాలను ఊడ గొడుతున్నాడని ఆరోపించారు. నిరుద్యోగ యువత నడ్డి విరుస్తూ యువతను సన్యాసాలు, మతాలకు తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పర్శరాములు గౌడ్,ప్రభాకర్ రెడ్డి,రంజిత్ రెడ్డి,మల్లయ్య,గఫూర్,రాజు, వెంకటేష్ పాల్గొన్నారు. ఆయా గ్రామాల ముఖ్య నాయకులు ఆధ్వర్యంలో రాంపూర్ గ్రామశాఖ అధ్యక్షులుగా రంజిత్, మగ్దుంపూర్ బీఆర్ఎస్వీ అధ్యక్షులుగా శేఖర్, 18 మందితో పూర్తి కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దాసరి రమేష్,మండల ఉపాధ్యక్షులు అప్పాల శేఖర్ యాదవ్,నియోజకవర్గ ప్రచార కార్యదర్శి దేవులపల్లి కృష్ణ, తేలు రఘు, కొలిపాక బాబు, నర్సింలు,సూర్యకాంత్ రెడ్డి, మహేష్,రాజు, పిల్లి రాజు, శ్యామ్ కుమార్, బాలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను పస్తులుండనివ్వం



నవతెలంగాణ-గజ్వేల్

పేదలను పస్తులుండనివ్వమని నేను సైతం ట్రస్టు సభ్యులు ఆకారం శ్రీకాంత్, కుమార్ అన్నారు. సోమవారం దొంతుల ప్రసాద్ గార్డెన్ లో సిల్వర్ జూబ్లీ కార్యక్రమం నిర్వహించగా అక్కడ మిగిలిపోయిన ఆహారాన్ని ఆటో ద్వారా పేదలు నివాసం ఉంటున్న వద్దకు తీసుకువచ్చి పంపిణీ చేశామన్నారు. గజ్వేల్ చుట్టుపక్కల ఉన్న ఫంక్షన్ హాల్ లో రోజు ఏదో ఒక కార్యక్రమం జరుగుతుందని వారు చెప్పారు. ఫంక్షన్ నిర్వహించే నిర్వాహకులు ఆహారం మిగులుతే తమ సమాచారం ఇస్తున్నారని వారు చెప్పారు. అంతేకాకుండా ఫంక్షన్ హాల్ నిర్వాహకులు కూడా సమాచారం ఇచ్చి పేదలకు ఆహారం తీసుకపోవాలని సమాచారం అందిస్తున్నట్లు వారు చెప్పారు. గజ్వేల్ మున్సిపల్ పరిధిలో చాలా చోట్ల డేరాలు వేసుకొని జీవనం గడుపుతున్నారని వారు తెలిపారు. ఇంటిలో పెద్దలు కూలికి వెళ్ళిన మరికొందరు ఇంటి వద్దనుకుంటున్నారని ఈ ఆహారాన్ని వారికి అందిస్తున్నామన్నారు. తాము తీసుకపోయిన ఆహారాన్ని పేదలు తీసుకొని సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రెండు పూటలా భోజనం చేస్తున్నామని సంతోషపడుతున్నారు.

శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై శిక్షణ



నవతెలంగాణ-ములుగు

ములుగు అటవీ కళాశాలలో జూన్ 1 నుండి జూన్ 7వ తేదీ వరకు 25 మంది రైతులకు 'శాస్త్రీయ తేనెటీగల పెంపకం'పై శిక్షణ కార్యక్రమాన్ని జాతీయ తేనెటీగల పెంపకం, తేనె మిషన్ (ఎన్బిహెచ్ఎం), జాతీయ బీ బోర్డు, వ్యవసాయం, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ సహకారంతో నిర్వహిస్తుంచనున్నారు. ఏడు రోజుల శిక్షణలో పాల్గొనే రైతులకు అల్పాహారం, భోజనం, టీ, రాత్రి భోజనం ,బస ఏర్పాటు చేస్తామని అటవీ కళాశాల అధికారులు తెలిపారు అలాగే భారత ప్రభుత్వ నిబంధనలు/వాస్తవ సాధారణ తరగతి రైలు/బస్సు/టికెట్లో ఏది తక్కువైతే అది పాల్గొనేవారికి లేదా రైతులకు ప్రయాణ భత్యం చెల్లించబడుతుంది. వారు తెలిపారు .ఆసక్తి గల రైతులు డాక్టర్. వసీమ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ (మొబైల్ నెం.7876531614)ను సంప్రదించాలని తెలిపారు.

ఏం పాపం చేశామని అక్రమ అరెస్టులు



నవతెలంగాణ-దుబ్బాక

'ప్రభుత్వానికి ఎల్లప్పుడు సహకరిస్తున్న తమకు తక్కువ వేతనాలు చెల్లించడం బాధాకరం. ఓట్లప్పుడు గుర్తుకొచ్చే తాము ఇప్పుడు గుర్తులేమా? ఏం పాపం చేశాం' అని అక్రమ అరెస్టులు చేస్తున్నారని వీఓఏ దుబ్బాక మండలాధ్యక్షుడు జింక లక్ష్మణ్ అన్నారు. సోమవారం హైదరాబాద్లోని సెర్ప్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న తమను ఇండ్లవద్దే అక్రమంగా అరెస్టు చేశారని అధ్యక్షుడు జింక లక్ష్మణ్, ఉపాధ్యక్షులు జమున, జాలిగామ బాబు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను అన్ని విధాలా వాడుకుంటున్న ప్రభుత్వం తమకు మాత్రం వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి వివోఏ లను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీసం వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు,ఉద్యోగ భద్రత,ప్రమాద బీమాను కల్పించాలన్నారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలన్నారు. వివోఏలు సంధ్య, సుజాత, పద్మ, రాధిక, మమత, రేఖ, నవీన పలువురున్నారు.

ఇంటింటా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి



నవతెలంగాణ-సిద్దిపేట

రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల గురించి ఆలోచించి సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని, ఈ పథకాలను ప్రతి ఇంటింటా ప్రచారం చేయాలని 18 వార్డు బిఆర్ఎస్ నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజిలు అన్నారు. బిఆర్ఎస్వి ఆత్మీయ సమావేశ కార్యక్రమంలో భాగంగా 18వ వార్డు కౌన్సిలర్ అడ్డగట్ల కావేరి అంజి ఆధ్వర్యంలో వార్డు నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. వార్డు బీఆర్ఎస్వీ అధ్యక్షులుగా మని చంద్ర నియమించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల అక్రమ అరెస్టులు ఆపాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య



నవతెలంగాణ- గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీవోఏల ధర్నాకు అనుమతి ఇచ్చి జిల్లా రాష్ట్రవ్యాప్తంగా వీవోఏలను మహిళలు అని చూడకుండా ఉదయం ఐదు గంటల నుండి అక్రమ అరెస్టు చేసి, నిర్బంధం ప్రయోగించిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య విమర్శించారు. గజ్వేల్ పట్టణంలో ఐదు గంటలకే ముందస్తుగా గజ్వేల్ పోలీసులు వెంకట చారి, రాములు, రాజు ఇతరులను అక్రమంగా అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. గౌరారం జగదేవ్పూర్ , బేగంపేట్ రాయపోల్, కుకునూరు పల్లి పోలీసులు వీవోఏలను హైదరాబాద్కు వెళ్లకుండా ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నామన్నారు. ఇందిరాపార్క్ వద్ద ప్రభుత్వ అనుమతితో ధర్నా నిర్వహించుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిమంది వీవోఏలను అక్రమ అరెస్టులకు పాల్పడడం సరికాదన్నారు. పోరాడి సాధించిన తెలంగాణలో నిర్బంధాలతో ఉద్యమాలను అణచలేరన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో శాంతిమార్గం ద్వారా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు ఉధృతం చేస్తామని తెలిపారు.

వీవోఏల ముందస్తు అరెస్టులు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల ఐకేపీ వివోఏలను సోమవారం రాజగోపాల్ పేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. వీవోఏల సమస్యల పరిష్కారానికి చలో ఇందిరా పార్కు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీవోఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. శాంతియుతంగా చేపట్టిన చలో ఇందిరా పార్కు కు తరిలివెళ్ళే క్రమంలో అరెస్టు చేయడం సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జహీరొద్దిన్, వెంకటేశం, పులి రాజు, పర్శరాములు, రమాదేవి, భాగ్యలక్ష్మీ, వెంకట లక్ష్మీ, ఉమా తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ అఫీషియల్గా కల్లపల్లి కృష్ణ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్గా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కు చెందిన సభ్యుడు కల్లపల్లి కృష్ణ కుమార్ను ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈనెల 30, 31న నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలలో రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్ కు టెక్నికల్ అఫీషియల్ వ్యవహరించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శి కరోల్ల వెంకటస్వామి గౌడ్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి నాగేందర్, స్పోర్ట్స్ క్లబ్ కన్వీనర్ పాల సాయిరాం, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బండారుపల్లి శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి , జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కనక రెడ్డి , ప్రభాకర్, ఉప్పలయ్య , నిశాంక్, మహేశ్ లు కృష్ణ కుమార్ను అభినందించారు.

సుడా మోడల్ లేఔట్ ప్రత్యక్ష వేలం పాట షురూ

- మొదటిరోజు మందకొడిగా సాగిన వేలంపాట
- వేలంలో 30 అప్లికేషన్లు 14 ప్లాట్స్ సెల్
- నేడు కూడా కొనసాగనున్న వేలంపాట
- వేలంపాట నిర్వహిస్తున్న సుడా వైస్ చైర్మన్ తదితరులు
- వేలం పాటలో పాల్గొన్న ఆసక్తిపరులు



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట డెవలప్మెంట్ అథారిటీ (సుడా) ఆధ్వర్యంలో సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన సుడా మోడల్ లేఅవుట్ ప్రత్యక్ష వేలంపాటను సోమవారం విపంచికళా నిలయంలో నిర్వహించారు. ప్రత్యక్ష వేలంపాటకు సంబంధించి ఇంతకుముందే రెండు అవగాహన సదస్సులు నిర్వహించినప్పటికీ వేలంపాట రోజు స్పందన మందకొడిగా కనిపించింది. ఉదయం 10 గంటలకు వేలంపాట ప్రారంభం కావల్సి ఉండగా 12 గంటల వరకు ఐదు నుంచి పదిమంది మాత్రమే హాజరయ్యారు. 12 గంటలకు వేలంపాట ప్రారంభం కాక 101 ప్లాట్ను వేలంపాటలో వాడుకోవడానికి అవకాశాన్ని కల్పించారు. మొదటి రోజు వేలంపాట అంతా ఆసక్తిగా కనబడలేదు. చదరపు గజానికి రూ.8 వేలుగా ధర నిర్ణయించి ప్రత్యక్ష వేలంపాటకు తీసుకువచ్చిన సుడాకు ఒక్కో ఫ్లాట్లోని గజానికి ధర రూ.8200, అత్యల్పంగాను రూ.9200 అత్యధికంగాను పలికింది. మొదటిరోజు మొత్తం 30 అప్లికేషన్లు రాగా 14 ప్లాట్స్ విక్రయించబడ్డాయి. కాగా కార్నర్ ప్లాట్స్కు సంబంధించి సుమారు 30 ప్లాట్స్ బ్లాక్ చేసి పెట్టారు. వాటిని రెండవసారి మూడోసారి వేలంపాటలో రిలీజ్ చేస్తామని అధికారులు తెలిపారు. మంగళవారం కూడా వేలంపాట నిర్వహించనున్నట్లు ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొని సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఫ్లాట్స్ దక్కించుకోవాలని సుడా వైస్ చైర్మన్ సూచించారు. కార్యక్రమంలో సుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ నందనం సుడా సిబ్బంది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘునందన్ రావ్ ఇంటికే



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

మెదక్ ఎంపీ ఆదేశానుసారం సోమవారం తాళ్లపల్లి గ్రామంలో బీఆర్ ఎస్ పార్టీ, విద్యార్థి విభాగం, యువజన విభాగం, సోషల్ మీడియా విభాగాల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తాళ్ళపల్లి గ్రామ యువత అధ్యక్షునిగా అవునూరి నరేష్,సోషల్ మీడియా అధ్యక్షుడి గా కాసులబాద్ నాగరాజు, విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా గోపరి అశోక్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జ్ పాపని సురేష్ గౌడ్, దుబ్బాక మండలపార్టీ మాజీ అధ్యక్షుడు టేకులపల్లి మల్లా రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడోల్ల దేవరాజ్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు చేస్తున్న అసత్యపు, అబద్ధపు ప్రచారాలు ఎప్పటికప్పుడు ఎండగట్టుతు బీజేపీ నాయకులను గ్రామాలలో అడ్డుకునేందుకు నిలదీస్తామని హెచ్చరించారు. 2023-2024 సార్వత్రిక ఎన్నికలలో రఘునందన్ రావును ఇంటికి పంపడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామీణ స్థాయిలో ప్రతీ ఇంటికి చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంచార్జ్లు దమ్మగౌని ప్రశాంత్ గౌడ్, ఎర్రోళ్ల రాజు, పార్టీ అధ్యక్షుడు చౌదర్పల్లి శ్రీనివాస్, టెలికాం బోర్డ్ మెంబెర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్, కూడవెల్లి పాలక మండలి సభ్యుడు పాతూరి తిరుపతి గౌడ్, సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ యాదగౌడ్, రైతు సమన్వయ కమిటీ మెంబర్ వేల్పుల నర్సింలు, వార్డ్ సభ్యులు జైపాల్ రెడ్డి, పాతూరి దుబ్బగౌడ్, గోపరి నర్సింలు, గోపరి బాలయ్య, బొమ్మరపు ఎల్లం, పాతూరి భాను,పెద్దోల్ల స్వామి,గోదా రాజు,గోద తిరుపతి,వేల్పుల శేఖర్,వేల్పుల సతీష్,వేల్పుల ఆంజనేయులు, గోషికే రాము, గోపరి బాలు, గోపరి కిష్టయ్య, గోపరి కనకరాజు, గోద స్వామి, గోద దేవయ్య, గోషికే రవి, పాతూరి సాయి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

సైన్స్ మనజీవితంలో ఒక భాగం

జిల్లా ఒకటవ అదనపు న్యాయమూర్తి భవాని

నవ తెలంగాణ-సిద్దిపేట

సైన్స్ మనజీవితంలో ఒక భాగమని, దానిని నిరంతరం అభ్యసిస్తూ నిజజీవితంలో వినియోగించుకోవాలని జిల్లా ఒకటవ అదనపు న్యాయమూర్తి భవాని అన్నారు. స్థానిక ఇందిరా నగర్ హైస్కూల్‌లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక వేసవి శిక్షణ శిభిరం ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవులలో జెవివి విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వడం హర్షనీయమన్నారు. మీ మీ సబ్జెక్టు లను బాగా చదివి విషయావగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. మాతృభాషను గౌరవిస్తూ ఇతర భాషలపై పట్టుసాదించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి బహుమతి ప్రధాత , బిఆర్ఎస్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు ఫక్రుద్దీన్ మాట్లాడుతూ జెవివి కార్యక్రమాలు మూఢనమ్మకాలు రూపుమాపెలా ఉంటాయన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితములో వినియోగించుకోవాలన్నారు. జెవివి కార్యక్రమాలకు తమ సహకార ఎప్పటికి ఎంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు అతిధుల ముందు ప్రదర్శించి మెప్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షులు మొలుగు బాలరాజు, జెవివి సభ్యులు సాదత్ అలీ, మహేందర్, కిషోర్, రవి, నటుడు, కథారచయిత హ్యూమయూన్ సంగీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యార్థులకు కరాటే శిక్షణ ఎంతో అవసరం

నవతెలంగాణ-జగదేవపూర్

కరాటే వేసవి శిక్షణా శిబిరం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు అన్నారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ మరియు క్రీడల శాఖ సహకారంతో కరాటే అసోసియేషన్ జగదేవపూర్ ఆధ్వర్యంలో జగదేవపూర్‌లో సోమవారం కరాటే వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు సందర్శించారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడాకారులకు విద్యార్థులకు కరాటే ఎంతో ఉపయోగకరమని ముఖ్యంగా బాలబాలికల స్వీయ రక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరమన్నారు. బాలబాలికలు విద్యతో పాటు అన్ని రంగాలలో నైపుణ్యాన్ని కలిగి వుండాలని ప్రస్తుత సమాజంలో విద్యార్థినులకు ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొవడానికి కరాటే శిక్షణ ఎంతో అవసరమన్నారు . తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని సూచించారు. వేసవి శిబిరంలో కరాటేలో మెళకువలు నేర్చుకొని పరిణితి సాధించి జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయిలో మంచిపేరు తేవాలన్నారు. కరాటే జిల్లా అసోసియేషన్ చీఫ్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు ప్రత్యేక శిబిరం తరగతులు ఉంటాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువజన ప్రతినిధి ప్రశాంత్, కరాటే శిక్షకులు పవన్ కళ్యాణ్, ప్రవళిక, భరత్ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సెల్ ఫోన్ తిరిగి అందించిన పోలీసులు



నవతెలంగాణ-జగదేవపూర్

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను జగదేవపూర్ పోలీసులు సిఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేశారు. జగదేవపూర్ ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం మునిగడప గ్రామాని కి చెందిన పబ్బ రవి గౌడ్ 35 రోజుల క్రితం తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. తరువాత జగదేవపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది రమేష్ సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ యాప్‌లో సెల్ ఫోన్ వివరాలు నమోదు చేసి బ్లాక్ చేశారు. ఫోన్ దొరికిన వ్యక్తి అందులో ఉన్న సిమ్ కార్డు తీసేసి, తన సిమ్ కార్డ్ వేశాడు. సెల్‌ఫోన్ వినియోగిస్తున్న అతని ఫోన్ నెంబర్ వివరాలు పోలీసులకు తెలియడంతో వెంటనే అతడిని గుర్తించి అతని వద్ద నుంచి సెల్ ఫోను స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ కృష్ణమూర్తి సెల్ ఫోను అందజేశారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే ఫోన్ నెంబర్ ఇతర వివరాలు సిఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తజోద్దీన్ పాల్గొన్నారు.

31న బ్రాహ్మణ భవనం ప్రారంభం

నవతెలంగాణ -గజ్వేల్ : ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఈ నెల 31వ తేదిన రంగారెడ్డి జిల్లా గోపాల పల్లిలో బ్రాహ్మణ భవనం ను ప్రారంభిస్తారని బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు శేషం శ్రీనివాసచార్యులు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రూ. 12 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణుల కోసం బ్రాహ్మణ పరిషత్ ఏర్పాటు చేయడం సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ ద్వారా బ్రాహ్మణులందరికీ విద్యా ఉద్యోగ వ్యాపార అవకాశాలు రానున్నట్లు ఆయన తెలిపారు.

అబద్ధాలు నమ్మి మోసపోయాం



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

ఎమ్మెల్యే మాటలు విని మోసపోయిన బీజేపీ నాయకులు బీఆర్ఎస్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సిద్ధాంతాలు నచ్చి చేరడం సంతోషకరమని దుబ్బాక మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం దుబ్బాక మండలం పద్మశాలి గడ్డ గ్రామంలోని బీజేపీ యూత్ అధ్యక్షుడు రెడ్డబోయిన రజినీకాంత్, బీజేపీ సోషల్ మీడియా యూత్ కన్వీనర్ రెడ్డబోయిన రంజిత్ బీజేపీ సిద్ధాంతాలకు విసిగిపోయి దుబ్బాక ఎమ్మెల్యే అబద్ధపు మాటలు నమ్మి మోసపోయి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని నమ్మి ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితోనే దుబ్బాక అభివృద్ధి సాధ్యమని పార్టీలో చేరినట్లు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు అన్నారు. కార్యక్రమంలో కేపీఆర్ యువసేన దుబ్బాక ఇన్చార్జిలు పర్స దేవరాజ్, పున్న శివశంకర్ , కాసారం కృష్ణ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రవి తదితరులు ఉన్నారు

యువకులు క్రియాశీలకంగా పనిచేయాలి



నవతెలంగాణ-తొగుట

నూతన కమిటీ అధ్యక్షులు బీఆర్ఎస్ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సిహెచ్.మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బక్క కనకయ్యలు కోరారు. సోమవారం జప్తి లింగారెడ్డి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీలు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ విద్యార్థి, యువజన, సోషల్ మీడియా కమిటీలు ఎంపిక చేశామన్నారు. యువకులు క్రియాశీలకంగా పనిచేయాలని, బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. యూత్ అధ్యక్షునిగా నీల రాజు, ఉపాధ్యక్షునిగా బట్టికాడి అర్జున్ గౌడ్,బక్క కరుణాకర్, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా సింగాటం రవి, ఉపాధ్యక్షునిగా అర్జున్ గౌడ్(చిన్న) నీల కనకరాజు, సోషల్ మీడియా అధ్యక్షునిగా నీల ఆంజనేయులు ఉపాధ్యక్షునిగా రుద్రారం రవి, బట్టు నాగరాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, అనీల్, అశోక్, శ్రీకాంత్, రమేష్, అనంతరెడ్డి, తిరుపతిరెడ్డి, శేకర్, పులిందర్ రెడ్డి, నాగ రాజు, చెన్నారెడ్డి, కరుణాకర్, శివ, దుంపలపల్లి స్వామి, నీల శ్రీహరి, స్వామిగౌడ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సాధారణ సర్వసభ్య సమావేశం

నవ తెలంగాణ-రాయపోల్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11.00 గంటలకు ఎంపీపీ సర్వసభ్య నిర్వహించనున్నామని ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. ఎంపీటీసీ, సర్పంచులు, కో ఆప్షన్ సభ్యులు తప్పనిసరిగా హాజరై గ్రామాలకు సంబంధించిన అభివృద్ధి, సమస్యలపైన చర్చించి అధికారుల దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

హైదరాబాద్‌కు తరలిన వీవోఏలు



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి శాంతియుత పోరాటం ద్వారా ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పరిష్కరించడం లేదన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతన అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించే వరకు వీవోఏలు పోరాటం కొనసాగించాలని, వారికి సిఐటీయూ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. సిద్దిపేట ఉమ్మడి మండలాల అధ్యక్షులు రాజు, నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, వంశీ, సుష్మ, లావణ్య, చంద్రకళా,మంజుల, సుజాత, లావణ్య హారిక ,బాలమని తదితరులు ఉన్నారు.

ఐకేపీ వీవోఏలను అరెస్ట్ చేసిన పోలీసులు



నవతెలంగాణ-తొగుట

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు అమలు చేయాలని వీవోఏలు డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఐకేపీ వీవోఏలు సోమవారం సమ్మె చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేసేందుకు సన్నద్ధం అవుతుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

బాలవికాస సేవలు బెష్



నవ తెలంగాణ- గజ్వేల్

ప్రజలకు బాలవికాస సేవలు అందించడంలో భేష్ అని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక సర్పంచ్ బెండ లలిత ఆధ్వర్యంలో బాలవికాస నీటి శుద్ధికరణ ప్లాంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో బాలవికాస నీటి శుద్ధికరణ ప్లాంటులను ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. మంచి సేవలు అందిస్తున్నారని ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. నీటి శుద్ధి కేంద్రాల ద్వారా ప్రజలకు కొంతవరకు ఆరోగ్య సమస్యలు రావని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంగ మల్లేశం, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, పార్టీ సీనియర్ నాయకులు తాటికొండ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ అవతరణ దినోత్సవం

నవతెలంగాణ దుబ్బాక రూరల్ : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ అవతరణ దినోత్సవాన్ని జిల్లా ఉపాధ్యక్షుడు అమ్మన నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం దుబ్బాక మండల వనరుల కేంద్రం ఆవరణలో టీపీటీయఫ్ రాష్ట్ర సీనియర్ నాయకులు వి. రాజమౌళి టీపీటీయఫ్ పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ టీపీటీయఫ్ ఉపాధ్యాయ సమస్యలే కాకుండా సామాజిక సమస్యలను పరిష్కరించేందుకు ఐక్య ఉద్యమాలకు కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కోర్టులలో అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పట్ల ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రమేష్ గౌడ్, ప్రదీప్, నూర్ బాబా, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎజెండాపై సభ్యుల అభ్యంతరాలు



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సమావేశంలో ప్రవేశపెట్టిన ఎజెండాపై కౌన్సిల్ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సోమవారం సమావేశం మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యుల నుంచి సమాచారం సేకరించకకుండా టేబుల్ ఎజెండాను ఎందుకు ఏర్పాటు చేశారని మున్సిపల్ అధికారులను సభ్యులు ప్రశ్నించారు. గతంలోనే మంత్రి హరీష్ రావు మున్సిపల్ ఎజెండా తయారు చేసే ముందు సభ్యులతో చర్చించాలని చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదని సభ్యులు సమావేశంలో అధికారులను నిలదీశారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి కనుసైగలలో మున్సిపల్ ఎజెండా తయారవుతుందని కౌన్సిల్ సభ్యులు వాదనకు దిగారు. పాండవుల చెరువు వద్ద వినాయక ఘాటు కట్టాలని అనేకసార్లు సభ దృష్టికి తీసుకువచ్చినా ఎందుకు ఎజెండాలో పెట్టడం లేదని కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ చెప్పిన మాదిరిగా ఎజెండాను తయారు చేస్తున్నారని కమిషనర్‌ను సభ్యులు నిలదీశారు. సమావేశం పూర్తిగా గందరగోళంగా తయారైందని కొందరు సభ్యులు మధ్యనుండే వెళ్లిపోయారు. మున్సిపల్ ఎజెండాలో సభ్యులు సూచించిన ఏ ఒక్క పని కూడా అందులో పొందుపరచలేదని సభ్యులు వాపోయారు.

బోదకాలు వ్యాధిగ్రస్తులకు సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-తొగుట : బోదకాలు వ్యాధి బాధితులకు సామగ్రి పంపిణీ చేశా మని ఏఎన్ఎం లక్ష్మీ తెలిపారు. సోమవారం మండలం లోని వెంకట్రావు పేట గ్రామంలో బోదకాలు వ్యాధిగ్రస్తులకు దాదాపు 40 మందికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న టబ్బు, మగ్గు, సబ్బు, టవలు, క్రీం, బ్యాగులను అందించామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రాములు, ఆశా కార్యకర్తలు భాగ్యలక్ష్మి, యాదమ్మ, వినోద, లబ్ధిదారులకు ఉన్నారు.

స్వరాష్ట్రంలోనే దేవాలయాల అభివృద్ధి

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకలు పండుగలు

హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-కోహెడ

స్వరాష్ట్ర సాధనలోనె దేవాలయాల అభివృద్ధి జరిగిందని హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని తంగళ్ళపల్లి గ్రామంలో బీరప్ప కామరతి కల్యాణ మహోత్సవ వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో గత 10 రోజులుగా జరుగుతున్న బీరప్ప ఉత్సవాల్లో భాగంగా బీరప్ప కామరాజు కళ్యాణం డప్పు చప్పుళ్ళు భాజా భజంత్రీలు ఒగ్గు పూజారులచే అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, నిర్వాహకులు ఎమ్మెల్యేకు డప్పుచప్పుల్లతో ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయన్నారు. బంధువులు, సహచరులతో పండుగ నిర్వహించుకోవడం ప్రతి ఒక్కరూ ఆనందించే విషయమన్నారు. అనాదిగా భక్తిశ్రద్ధలతో గొల్ల కురుమల ఆరాధ్య దైవమైన శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రజలందరూ బాగుండాలని, అలాగే పాడి పంటలతో గ్రామం సమృద్ధిగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. స్వరాష్ట్రం సాధించుకున్నాక తెలంగాణ పల్లెలన్నీ అభివృద్ధికి చిరునామాలుగా మారి ఆచారాలు, సాంప్రదాయాలు పాటించుకుంటూ ఉన్నతంగా తీర్చిదిద్దుకున్నాయన్నారు. సీఎం కేసీఆర్ కలలకు అనుగుణంగా అడుగులు వేస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఒగ్గడోలు కళాకారుల బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవ చరిత్రను కథ రూపంలో భక్తులకు వివరించారు. కళ్యాణ మహోత్సవం ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్, కురుమ కుల బాంధవులు, బంధుమిత్రులు, గ్రామస్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.